నినాదం
https://hcusahityalahari.blogspot.com
# సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 16-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## గిరిజన కథల సంపుటికి రచనల ఆహ్వానం

గిరిజన జీవన విధానం, వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలు, భాష సామాజిక పోరాటాలను ప్రతిబింబించే కథలతో ఒక 'గిరిజన కథల సంపుటి' ని ప్రత్యేకంగా తీసుకురావాలని తలపెట్టాము.
తెలుగు సాహితీ లోకంలోని రచయితలు, పరిశోధకులు గిరిజన జీవనాన్ని సజీవంగా చిత్రీకరించే ఔత్సాహిక రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాము.
ఈ పుస్తకం ISBN నంబర్‌తో తీసుకురావాలని భావిస్తున్నాం.
కథలను పంపవలసిన వాట్సాప్ నంబర్లు:
- 6305584064, 94413 35123
లేదా ఈ మెయిల్ :
dsainath0606@gmail.com

ఇట్లు,
డి. సాయినాథ్ రెడ్డి,
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్

## కాలచక్రం - క్రమశిక్షణ

క్రమంగా నేర్చుకునే శిక్షణ ఈ క్రమశిక్షణ
కాలచక్రంలో క్రమశిక్షణ ఒక భూమిక
క్రమశిక్షణతో ఏదైనా సుసాధ్యమే

మానవ మాత్రుడైన రాముడిని శ్రీరామునిగా
చేయగలిగిన శక్తి కలది ఈ క్రమశిక్షణ
మార్కండేయుడుని చిరంజీవిగా చేసినది
అద్వితీయమైన శక్తిగల క్రమశిక్షణ

శిశుపాలుని నూరు తప్పుల వరకు
భరించగలిగే సహనాన్ని కృష్ణుడికి
వచ్చినది కూడా క్రమశిక్షణ వల్లనే

సహనం, ఓపిక, ధైర్యం, సాహసం వంటి
ఎన్నో అద్భుతమైన లక్షణాలు కలిగి ఉన్నదే క్రమశిక్షణ

క్రమశిక్షణతో గాంధీ దేశానికి స్వాతంత్రం తెచ్చెను
తరాలే మారినా, యుగాలే మారినా
ఎప్పటికీ ఎన్నటికీ విలువైన వజ్రంలా
నిలిచి ఉండే క్రమశిక్షణ కాలచక్రానికే మచ్చుతునక

క్రమశిక్షణతో మెలిగే వారు
కాలచక్రంలో సజీవంగా ఉంటారు
ఓ యువతా! క్రమశిక్షణతో సాధించలేనిది
ఏదీ లేదు అని తెలుసుకో

ఆరిశెట్టి రేవతీ గుప్తా
సాలూరు
విజయనగరం జిల్లా
ఆంధ్ర ప్రదేశ్
లిఫోన్: 8019127668

## తెలుగు శతకాలు వ్యక్తిత్వ వికాసానికి అక్షర పాఠాలు

**తెలుగు శతకం వంద పద్యాల పరిమితిలో ఇమిడిపోయిన సాహిత్య ప్రక్రియగా మాత్రమే చూడలేం. అది మనిషి అనుభవానికి, లోకజ్ఞానానికి, నైతిక చింతనకు, ఆత్మపరిశీలనకు పద్యరూపం ఇచ్చిన ప్రజాసాహిత్య సంప్రదాయం. రాజుల చరిత్రను, పురాణగాథలను, మహాకావ్య ఇతివృత్తాలను సాహిత్యం ప్రధాన వస్తువులుగా స్వీకరించిన కాలంలోనూ, శతకం సామాన్య మానవుడి జీవనాన్ని తన కవితా వస్తువుగా చేసుకుంది. అందుకే శతకాన్ని చదవడం అంటే కేవలం పద్యాలను చదవడం కాదు. ఒక సమాజం తన జీవితాన్ని తాను ఎలా అర్థం చేసుకుందో చదవడం.**

తెలుగు సాహిత్యంలో శతకానికి ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించింది దాని ప్రజాసాన్నిహిత్యం. దీర్ఘమైన కథనాలు, సంక్లిష్టమైన కావ్య నిర్మాణాలు అవసరం లేకుండానే ఒక జీవిత సత్యాన్ని కొద్ది పాదాల్లో స్ఫుటంగా చెప్పగలిగిన కవితా రూపం అది. మకుటం దానికి శిల్పపరమైన ప్రత్యేకతను ఇవ్వడమే కాకుండా, పద్యాన్ని శ్రోతల జ్ఞాపకంలో నిలిపే సాధనంగా కూడా పనిచేసింది. చదివినవాడు మరచిపోయినా విన్నవాడు గుర్తుంచుకునేలా, పుస్తకం లేకపోయినా నోట పలికేలా శతక పద్యం రూపుదిద్దుకుంది. ఈ మౌఖిక ప్రసరణే శతకాన్ని పుస్తకపు అక్షరాల నుంచి ప్రజల జీవనంలోకి తీసుకెళ్లింది.
శతక కవిత్వ గొప్పతనం దాని వస్తు వైవిధ్యంలోనూ కనిపిస్తుంది. భక్తి దాని ఒక పార్శ్వమైతే, నీతి మరో పార్శ్వం. "తాత్విక విచారణ, వైరాగ్య భావన, మానవ స్వభావ పరిశీలన, సామాజిక విమర్శ, లోకవ్యవహార జ్ఞానం" ఇవన్నీ శతక కవిత్వంలో తమకు తగిన స్థానం సంపాదించుకున్నాయి. అందువల్ల శతకాన్ని ఒకే భావజాలపు మూసలో చూడటం దాని సాహిత్య విస్తృతిని కుదించడం అవుతుంది.
ముఖ్యంగా శతకం మనిషి అంతరంగాన్ని తన వస్తువుగా చేసుకుంది. మనిషి బయట ప్రపంచాన్ని జయించడానికి ముందు తనలోని దుర్బలతలను జయించాలనే భావన అనేక శతకాల్లో కనిపిస్తుంది. ధనం, అధికారం, అహంకారం, అసూయ, దురాశ, కపటం, మోసం, మితిమీరిన ఆశ వంటి మానవ ప్రవృత్తులను శతక కవి పరిశీలించాడు. అదే సమయంలో సత్యం, వినయం, వివేకం, నిగ్రహం, దయ, స్నేహం, ఔదార్యం వంటి గుణాలను వ్యక్తి జీవనానికి పునాదులుగా ప్రతిపాదించాడు. ఈ అర్థంలో శతకం నీతిశాస్త్రాన్ని కవిత్వంగా మార్చిన ప్రక్రియ మాత్రమే కాకుండా, మనిషి స్వభావాన్ని పరిశీలించిన ఒక ప్రజా తాత్విక సంప్రదాయం.
ఈ సంప్రదాయానికి వేమన పద్యాలు ఒక విశిష్టమైన శిఖరం. వేమనను కేవలం నీతికవి అనే పరిధిలో ఉంచితే ఆయన కవిత్వంలోని ధిక్కార స్వరాన్ని కోల్పోతాం. ఆయన పద్యంలో కనిపించేది ఉపదేశం కంటే ప్రశ్నించే స్వభావం; నీతిబోధ కంటే సామాజిక ముసుగులను తొలగించే ప్రయత్నం. కులవిభేదం, ఆచారాల ఆడంబరం, కపట భక్తి, మూఢనమ్మకం, మానవ సంబంధాల్లోని అసమానత వంటి అంశాలను ఆయన సూటిగా ప్రశ్నించాడు. ఆయన కవిత్వంలో కనిపించే సరళత వెనుక తీవ్రమైన ఆలోచనా పదును ఉంది. అందుకే వేమన పద్యం సామాన్యుడి మాటలా వినిపించినా, దాని వెనుక ఒక సామాజిక తాత్వికత పనిచేస్తుంది.
వేమన ప్రత్యేకత ఆయన చెప్పిన విషయాల్లోనే కాకుండా, చెప్పిన తీరులోనూ ఉంది. పాండిత్య ప్రదర్శనకు దూరంగా, జనభాషకు దగ్గరగా, అనుభవం నుంచి పుట్టిన మాటలా పద్యాన్ని మలచడం ఆయన కవిత్వానికి ప్రజాస్వామిక స్వభావాన్ని ఇచ్చింది. కవి తనను తాను ఎత్తైన పీఠంపై నిలబెట్టుకుని సమాజానికి ఉపదేశించడు. సమాజం మధ్య నిలబడి దాని లోపాలను దాని భాషలోనే ప్రశ్నిస్తాడు. ఈ కారణంగానే వేమన పద్యం శతాబ్దాలు దాటినా తన సంభాషణా శక్తిని కోల్పోలేదు.
ఇక సుమతీ శతకం శతక ప్రక్రియలో మరో ముఖ్యమైన ధోరణిని ప్రతిబింబిస్తుంది. ఇక్కడ తాత్వికత ఆకాశంలో విహరించదు. నిత్యజీవితంలోకి దిగివస్తుంది. మనుషులతో ఎలా మెలగాలి, ఎవరిని నమ్మాలి, మాటకు ఉన్న విలువ ఏమిటి, ధనం--సంబంధాలు--ప్రవర్తన మధ్య ఎలాంటి సమతుల్యత అవసరం వంటి విషయాలను సులభమైన భాషలో చెబుతుంది. అందువల్ల సుమతీ శతకంలోని నీతి కేవలం నైతిక ఉపదేశంగా కాకుండా ఒక సమాజపు అనుభవజ్ఞానంగా చూడాలి. తరతరాల జీవనానుభవం పద్యరూపంలో సాంద్రీకృతమై అక్కడ కనిపిస్తుంది. ఇదే శతక సాహిత్యంలోని అసలైన సాంస్కృతిక విలువ. అది గ్రంథాలయాల్లో మాత్రమే జీవించిన సాహిత్యం కాదు. తల్లిదండ్రుల నోట, గురువుల బోధనలో, పాఠశాల పఠనంలో, సామూహిక జ్ఞాపకంలో తిరిగిన సాహిత్యం.
తెలుగు శతకాలు శతాబ్దాల క్రితమే తమదైన భాషలో మాట్లాడాయి. శతకాలు మనిషిని విజయానికి సిద్ధం చేయడం కంటే ముందుగా మనిషిగా నిలబడటానికి సిద్ధం చేయాలనుకున్నాయి. ఈ తేడా శతక సాహిత్యంలోని మౌలిక దృష్టిని స్పష్టం చేస్తుంది.
ఇక్కడే శతక సాహిత్యాన్ని నేటి తరానికి తిరిగి పరిచయం చేయాల్సిన అవసరం కనిపిస్తుంది. శతకాలను కేవలం కంఠస్థం చేయించడమే వాటి పునరుద్ధరణకు సరిపోదు. వాటి వెనుక ఉన్న ఆలోచనా ప్రపంచాన్ని విద్యార్థులతో సంభాషింపజేయాలి. ఒక పద్యం ఏ సామాజిక సందర్భంలో పుట్టింది? కవి ఎవరిని ప్రశ్నిస్తున్నాడు? ఏ విలువను ప్రతిపాదిస్తున్నాడు? ఆ విలువ నేటికీ వర్తిస్తుందా? వర్తించకపోతే ఎందుకు? అనే ప్రశ్నలు అడిగినప్పుడే శతకం సజీవ సాహిత్యంగా మారుతుంది. నేటి డిజిటల్ యుగంలో సంక్షిప్తమైన వాక్యాలు, సూక్తులు, సందేశాలు క్షణాల్లో వ్యాపిస్తున్నాయి. ఈ సమాచార సంస్కృతిలో శతకానికి కూడా ఒక ఆసక్తికరమైన సమకాలీనత ఉంది. సంక్షిప్తత, జ్ఞాపకశక్తిని ఆకర్షించే నిర్మాణం, ఒకే ఆలోచనను పదునుగా ప్రతిపాదించడం, పాఠకుడిని ఆలోచింపజేసే ముగింపు---ఇవన్నీ శతక పద్యానికి ఉన్న లక్షణాలే. మాధ్యమం మారిపోయింది; ఒక తరం నేర్చుకున్న పద్యం మరో తరానికి మౌఖికంగా చేరింది. ఈ ప్రసరణలో పద్యం కేవలం సాహిత్య పాఠ్యంగా కాకుండా జీవనానుభవానికి వ్యాఖ్యగా మారింది. అందుకే శతకాలు తెలుగు సమాజపు సామూహిక స్మృతిలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి.
అయితే శతకాలను విమర్శనాత్మక దృష్టితో చదవాల్సిన అవసరం కూడా ఉంది. అవి పుట్టిన కాలపు సామాజిక నిర్మాణాలు, విలువలు, లింగ సంబంధాలు, కుటుంబ భావనలు, అధికార సంబంధాలు వాటిలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి శతకంలోని ప్రతి నీతిని కాలాతీత సత్యంగా స్వీకరించడం ఎంత అసమంజసమో, వాటిని పాతకాలపు పద్యాలుగా కొట్టిపారేయడం కూడా అంతే అసమంజసం. సాహిత్యాన్ని చరిత్రతో సంభాషింపజేస్తూ చదివినప్పుడే దాని అంతరార్థం మనకు బోధపడుతుంది. ఏ భావన కాలానికి పరిమితమైందో, ఏ జీవన సత్యం కాలాన్ని అధిగమించిందో గుర్తించడం పాఠకుడి విమర్శనాత్మక వివేకంపై ఆధారపడి ఉంటుంది.
ఈ సందర్భంలో ఆధునిక వ్యక్తిత్వ వికాస భావనతో శతకాలను పోల్చడం ఆసక్తికరం. నేడు వ్యక్తిత్వ వికాసం ఒక ప్రత్యేక శిక్షణా రంగంగా మారింది. సంభాషణా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, భావోద్వేగ నియంత్రణ, వైఫల్యాన్ని ఎదుర్కొనే సామర్థ్యం, సమయ నిర్వహణ వంటి అంశాలపై శిక్షణలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఆధునిక జీవిత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందినవే. అయితే వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన విలువల గురించి మానవ మనస్సు ఒక సారాంశమైన, గాఢమైన ఆలోచనను పట్టుకోవాలనే అవసరం మాత్రం మారలేదు.
తెలుగు శతకాన్ని అందుకే కేవలం 'నీతి పద్యాల' పరిధిలో బంధించకూడదు. అది ప్రజల అనుభవాన్ని కవిత్వంగా మలిచిన రూపం. అది లోకజ్ఞానాన్ని పద్యంలో నిలిపిన జ్ఞాపకశక్తి. అది వ్యక్తిని ప్రశ్నించిన అంతర్ముఖ స్వరం. అది సమాజంలోని విరోధాభాసాలను ఎత్తిచూపిన విమర్శనాత్మక దృష్టి. అది భక్తిని వ్యక్తం చేసిన చోట ఆధ్యాత్మిక అనుభూతికి, నీతిని చెప్పిన చోట జీవనవివేకానికి, సామాజిక అసమానతను ప్రశ్నించిన చోట ప్రతిఘటనకు భాషనిచ్చింది.
అందుకే శతక సాహిత్యం గతానికి చెందిన ఒక మూసగా మిగిలిపోకుండా, వర్తమానంతో సంభాషించగల సజీవ సాహిత్య వారసత్వంగా నిలుస్తోంది. కాలం మారుతుంది, జీవన విధానాలు మారుతాయి, విలువల నిర్వచనాలు మారుతాయి. అయినా మనిషి తనను తాను ప్రశ్నించుకోవాల్సిన అవసరం మాత్రం మిగులుతుంది. ఆ ఆత్మపరిశీలనకు తెలుగు శతకాలు ఇప్పటికీ ఒక అద్దాన్ని అందిస్తున్నాయి. ఆ అద్దంలో కనిపించేది కేవలం మన పూర్వీకుల ముఖచిత్రం కాదు- కాలాన్ని దాటి కొనసాగుతున్న మనిషి స్వభావం. అందుకే శతకం వంద పద్యాల సంఖ్యగా పరిమితం కాకుండా, ఒక సమాజం తన అనుభవాన్ని, తన వివేకాన్ని, తన సందేహాన్ని, తన జీవన దర్శనాన్ని తరతరాలకు అప్పగించిన అక్షర వారసత్వంగా నిలిచింది.

విర్గో : 8247045230

## దుబ్బ తువ్వాల

దుబ్బ తువ్వాల
మా నాయిన దగ్గర
ఒకే ఒక్క దుబ్బ తువ్వాల...!
పొద్దున నాయిన నుదుటి చెమట తుడిచేది అదే,
మధ్యాహ్నం మండే ఎండకు అడ్డంగా నిలిచేది అదే,
పొద్దికంల నాయిన ముఖాన కమ్ముకున్న దుఃఖాన్ని
ఎవరికీ కనబడకుండా దాచేది అదే.
రాత్రిపూట అలసిన శరీరానికి
ఒక మూల దుప్పటిలా ముడుచుకునేది అదే.
ఆ తువ్వాల మీద
చెమట చారలు ఎన్ని ఆరిపోయాయో
మా నాయినకే తెలుసు...
ఆ తువ్వాలకు తూద్వగా మిగిలిన చెమట
నేల మీద పడలేదు. మా బువ్వలో కలిసిపోయింది.
అందుకే ఆ తువ్వాల మీద ఆరింది చెమట కాదు..
మా నాయిన జీవితం.
మా నాయినకు ఉన్నవి రెండు తెల్లంగీలు,రెండు
అడ్డపంచెలు...!
కానీ...
మా ఇంటి సంతోషాలన్నీ
ఆ నాలుగు బట్టలకన్నా పెద్దవి.
పండుగొస్తే మా బట్టల్లోనే పండుగ రంగులు పూసేవి;
నాయిన ఒంటిమీద మాత్రం
గత పండుగే
మరోసారి మౌనంగా పండగ చేసుకునేది.
కొత్త బట్టల మాట ఎత్తితే
"పిల్లలకే ముందు" అంటడు నాయిన..
మాకు తెలియకుండానే
మా పండుగలన్నీ
తన పండుగలను తినేశాయి.
ఆరు నెలలకోసారి
లేకపోతే యాడాదికోసారి
ఒక జత తోలుచెప్పులు తెచ్చుకుంటడు...
మా నాయిన కాళ్లకు అవి చెప్పులు కాదు...
రోడ్డుమీద పడున్న ముళ్లన్నింటికీ
ఆయిన వేసుకున్న కవచం.
కాళ్ల పగుళ్లలో సిమెంటు చేరి తెల్లబడినా,
చెమటలో దుమ్ము కలసి మట్టి రంగైపోయినా,
ఆయిన అడుగులు మాత్రం మా ఇంటి భవిష్యత్తు వైపే
నడుస్తుండేవి.
నాయిన గౌలిగూడ బస్టాండు లాంటి
గందరగోళమైన జీవితాన్ని
భుజాన మోసుకొచ్చిండు.
ఎర్రమంజిల్ భవనాలంత
ఎత్తైన కలలు అతనివి కాకపోయినా..
తన పిల్లలు ఒకరోజు తలెత్తుకుని నిలబడితే చాలు
అదే అతని ఆకాశమనుకున్నడు...!
పంజాగుట్ట ట్రాఫిక్‌లా జీవితం ఎంత తొక్కిసలాట
పెట్టినా,...!
మా నాయిన అడుగు మాత్రం వెనక్కి పడలేదు..
మా బతుకు దారి దొరికేదాకా ముందుకే నడిచిండు.
బంజారాహిల్స్ రోడ్డు మీద
దూసుకుపోయే ఎన్ని కార్లను చూసినా..!
తన బతుకు మాత్రం
రోజుకూలీ బస్సులా...
ఉదయాన్నే బయలుదేరి, రాత్రికి అలసిపోయి
ఇంటిముంగిట ఆగిపోతుంది.
పొద్దంతా ఎండలో కరిగే తారురోడ్డులా
తన శరీరం కరిగిపోయింది.
ఆదివారం మాంసం కూర వండితే
తన గిన్నెలోని ముక్కలను కూడా
మా గిన్నెలోకి జారవిడిచే చేతులు అవి.
తన ఆకలిని మా కడుపుల మీద పెట్టి
తాను ఖాళీగా లేచే చేతులు అవి.
పొద్దు గుక్కినంక నాయిన ఒక గిలాస కల్లు తాగుతడు.
అది అతనికి పండుగ కాదు,
సంతోషం కూడా కాదు.
మత్తు కోసం మత్తు అసలే కాదు.
పొద్దంతా గుండెలో పేరుకున్న
దుఃఖాన్ని ఒక్కసారి గొంతులోకి దింపుకుని
రాత్రిని తట్టుకునే ఒక చిన్న ధైర్యం.
గిలాసలో కల్లు ఖాళీ అవుతుంది..కానీ
నాయిన బాధ ఖాళీ కాదు.అది గుండెలోనే ఉంటుంది.
ఆ బాధ పాత ఇనుపపెట్టెలో దాచిపెట్టిన పాత బట్టల
వాసనలా అలాగే ఉండిపోయింది.
కల్లు తాగినంక మా నాయినకు
కంటినిండా నిద్ర వస్తుంది...!
ఆ నిద్రను చూసిన నాకనిపించింది.
రోజంతా ప్రపంచం మీద ఇటుకలు పేర్చిన మనిషి
రాత్రికి తన కలల మీద ఒక్క దుప్పటి వేసుకుని
పడుకున్నాడని...!
నాయిన ఎప్పుడూ
తన కష్టాల గురించి చెప్పలేదు;
అందుకే మా ఇంట్లో గోడలకే
ఆయిన జీవిత చరిత్ర తెలుసు.
మా నాయిన జీవితం
పెద్ద రాజభవనం కాదు.
రెండు తెల్లంగీలు,
రెండు అడ్డపంచెలు,
ఒక దుబ్బ తువ్వాల.
ఒక జత తోలుచెప్పులు.
ఇవే అతని రాజ్యం.
కానీ ఆ చిన్న రాజ్యంలో
మేమే అతనికి రాజులం.
నాయిన తన ఆకలిని తలుపు బయట కూర్చోబెట్టి,
మా ఆకలికి అన్నం పెట్టిన రాజు.
నాయిన తన పండుగను మట్టిలో పాతిపెట్టి,
మా పండుగకు రంగులు కొన్న రాజు.
నాయిన తన కాళ్లకు చెప్పులు లేకున్నా
మా దారిలో ముళ్లు ఉండకూడదనుకున్న రాజు.
ఆ రాజుకు ఈరోజు ఒంటిమీద కొత్త బట్టలు లేకపోయినా..
మా బట్టల ప్రతి మడతలో
ఆయిన చెమట ఉంది.
మా చేతిలోని ప్రతి అక్షరం వెనకాలా
ఆయిన చేతి బొగ్గలున్నయ్.
మా నడకలోని ప్రతి అడుగుల వెనకాలా
అతని పగిలిన కాళ్ల ముద్రలున్నయి.
మా కళ్లలో కనిపించే ప్రతి కలకు
అతని నిద్రలేని రాత్రులే మూలం.
అందుకే మా నాయనకు
రెండు తెల్లంగీలు మాత్రమే ఉన్నా...!
మా బాల్యానికి మొత్తం ఆకాశం కప్పిండు నాయిన.
ఒకే దుబ్బ తువ్వాల ఉన్నా...!
మా కన్నీళ్లన్నిటినీ తుడిచిన చేయి నాయినదే.
తోలుచెప్పులు పాతబడిపోయినా
మా భవిష్యత్తు దారిని కొత్తగా తొక్కించిన అడుగు ఆయినదే.
తన బతుకును బూడిద చేసుకుని
మా జీవితాలకు దీపం వెలిగించిన
మట్టి మనిషి మా నాయిన.
ఒక రోజు ఆ దుబ్బ తువ్వాల కూడా
చిరిగిపోయి మట్టిలో కలిసిపోవచ్చు...
కానీ...!
ఆ తువ్వాలతో తుడిచిన
ఆ చెమట మట్టిలో కలవదు.
అది మా బువ్వలో ఉంది.
మా అక్షరాల్లో ఉంది.
మా నడకలో ఉంది.
మా కలలన్నిటి లోపల
నిశ్శబ్దంగా కొట్టుకుంటూనే ఉంటుంది.

మదిరాజ్ నరేష్
హైదరాబాద్ సెంట్రల్
యూనివర్సిటీ
9505781337



## నడిచిన దారిలో..

**నేను**
**నడిచిన దారిలో..**
**రాలుతున్న దుఃఖ అశ్రువులు.!**
**బొట్లు బొట్లుగా**
**పుంకను పుంకానులుగా ..**
**కన్నీళ్ల మేఘాలయి వర్షిస్తూ**
**కడలి కెరటాలు గా ఎగిసి పడుతూ**
**కాళ్ళ కింద భూకంపం వచ్చినట్లు**
**పాయలు పాయలుగా..**
**ప్రవహిస్తున్నాయి.!**

అలనాటి జ్ఞాపకాలు
పల్లె లోగిలి అనుభూతులు
అడుగు పెట్టిన ఆ నేల మీద
కమ్మని వాన వెలిసి తడిసిన మట్టి వాసనా
అత్తరు పూసుకున్నట్టు..
బురదలో నడుస్తున్న దృశ్యం

దారిపోడుగునా వేప, మామిడి
కొబ్బరి, రావి చెట్ల కొమ్మలు
విసన కర్రలయి ఊపుతున్నట్లు..
దారి చుట్టూ రంగు రంగుల పూల సింగిడి పైన వాలిన
సీతాకోక చిలుకల విన్యాసాలు
స్వాగతం పలుకుతుంటే
ఊరి గుమ్మం లో ఈత వనాల తో సయ్యటాలాడుతూ..
అలుగు దుముకుతున్న చెరువులోని నీటి తుంపరాలు
పంట పొలాలకు ఆద్యంతం
బాల్య స్నేహితుడయి పలుకరించినట్లు
ఈ హృదయం ఉప్పొంగి పోతుండే.!

**మట్టి కూన పెంకుల ఇంట్లోకి అడుగు పెట్టుదేమో..**
**పెరటి లోని అవుదూడ 'అంబ 'అంటూ**
**పలుకరిస్తూ.. నోటితో సొల్లు కారుస్తూ**
**పెయ్యంత నిమురుతుంటే**
**ఆ పందిరికి కాసిన సొరకాయ తలను**
**ముద్దేదుతున్న దృశ్యం చూసి**
**బావిలోని గిలక నన్ను చూసి**
**కన్నుకోట్టి ఆట ఆడిస్తుంటుండే.!**

చుట్టూ పక్కల అందరొచ్చి
చెయ్యి కలుపుతూ.. సరదాగా ఆట పట్టిస్తు
ఊరు చూద్దామని పట్టుకెళ్ళి చిన్న నాటి బడి
అరుగు మీద కూర్చొని
చిరు దిండ్లు తింటూ
కబుర్లు చెప్పుకున్న కాలం..
పోద్దు పోయిన రాలేదని
చీకటి పడుతుందన బెంగతో
మా ముసలవ్వ అదే మా నానమ్మ కర్ర బట్టుకొని
ఊరంతా వెతుకుతున్న ప్రేమకి
ఏమిచ్చి ఋణం తీర్చుకోవాలో
అర్థం కాని బుర్ర అప్పుడు!
మంచి అయినా, చెడు అయినా
ఊరు ఊరంతా
కులం, మతం మరిచిపోయి
ఇంటి గడప ముందు తిరునాళ్ల
జాతరను మరిపించేటోళ్ళు
అది చూసిన పసి గుండెకు
పల్లె!ఆకుపచ్చని పందిరిలో
అలసట లేని అలంబనా తో
కల్ల కపటం తెలియని అమాయకత్వం
ముసి ముసి నవ్వుల తొలకరి జల్లుల ఆప్యాయతలు
ఇప్పటికి అవి మరుపురాని అనుభూతుల హేల.!
చీమ చిటుకుమన్న పల్లె
నిదుర లేసేది
సూర్యుడు రాకముందే
ఇల్లు ఇల్లంత అలుకుతలు, ముగ్గుల ముద్దులతో
స్వాగతం పలికేది
అందరి మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోయేది
ప్రతి నిత్యం పండుగను మురిపించేది
అలా..
పెరిగిన జీవితం
అనుబంధాలు, అనురాగాలు
పెనవేసుకున్న పల్లె..
ఇప్పుడు
మోడుబారిన చెట్టుల..
ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటిమీద
వాలని దృశ్యం
పగలు కూడా రాత్రికి నేస్తాం అయ్యింది
ఆ ఇంటి తలుపులు కిటికీ లోంచి
తొంగి చూస్తాయి
దారులు మనుషుల అడుగుల చప్పుడు కోసం ఎదిరి
చూస్తాయి
మట్టి రోడ్ల మీద సిమెంట్ పెత్తనం చలాయిస్తుంటే..
కూన పెంకుల మీద ఆర్ సీ సీ బంగళాలు
అధికారంతో దర్పం ఓలక పోస్తున్నాయి
నీడ కోసం ఊరు ఊరంతా జల్లాడ పట్టాలి
ఎక్కడ ఒక చెట్టు లేదు..
ఉన్నా వాటికీ వాడిన కొమ్మలు
పిట్టల జాడే లేదు..
పూల నవ్వులే కరువాయే!
గిలక బావి మాయం
బోరు బావుల గోల..
నేను
నడిచిన దారిలో..
మమతల హరివిల్లు పిట్టేత్తుకెళ్ళిందేమో?
స్నేహపు పలకరింపు ఎండమావి అయింది
ఊర చెరువు మాయమై
భూభకసురుల అన్యాక్రంతా మైంది..
చదువుకున్న బడి బోసిపోయింది
చింత చెట్టు చిగురు చిన్న బోయింది.!

ఎన్నెన్నో..
ఇంటికోచ్చిన వేళ ఊరు నడి చస్తుండే..
ఊరంతా తిరిగిన పలుకరించే నాధుడు
కరువాయే నేడు.
ఇకా పంతం పట్టాలి
పల్లె కున్న గ్రహణం విడిపించాలి
ఇంటి ఇంటికి మొక్కలు నాటించాలి..
పల్లె మెడలో మళ్ళీ హరితహారం
దండ వేయాలి
బోసిపోయినా పసి పాపల నవ్వుల జల్లు కురిపించాలి
కలిసి వుంటే కలదు సుఖం మాటలు
మళ్ళీ వికసింప చెయ్యాలి
మమతానురాగాలతో పల్లె
మోములో అనుబందల పూలు గుభాలించాలి
అలనాటి ప్రేమలు పంచుదాం
ఊరి పొలిమేర చెరువు కి అలుగు దుమీకెలా..
చెయ్యి చెయ్యి కలుపుదాం
పర్యావరణ పరిరక్షణ కి కంకణం కట్టుకొందాం
పల్లె అమ్మ లాంటిది..
అమ్మ ఒడిలో ఆడుకునే ఆరోజు కోసం
నిరంతరం ప్రయత్నం చేద్దాం
మీ హృదయాల తలుపులు తెరవండి..
మంచి చేసే పనిలో తోడుగా నిలవండి
పల్లెలే పట్టుకొమ్మాలన్న మహాత్ముణ్ణి
మాటలు నిజం చేద్దాం.!
శ్రమైక జీవన సౌందర్యంతో
మళ్ళీ ఈనాడు..
పల్లె కళ్ళలో వెన్నెల వెలుగులు పూయిద్దాం.!!

కొండా రవీందర్ : 9059237771

నినాదం

https://hcusahityalahari.blogspot.com

# సాహిత్య లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,

ఆదివారం 16-08-2026

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com

Whatsapp No:6305584064



## డ్రగ్స్ మత్తు వదులు...

# అమ్మా నాన్నలే ముద్దు

పెద్దపల్లి జిల్లాలోని ఓ చిన్న తెలంగాణ పల్లె. ఊరి చివరన చెరువు, చెరువు గట్టున తుమ్మచెట్లు,వాటి నీడలో సాయంత్రం పూట కూర్చొని కబుర్లు చెప్పుకునే పిల్లలు.ఆ ఊరిలో పదో తరగతి చదువుతున్న చరణ్ అనే బాలుడు ఉండేవాడు. చరణ్ చదువులో చురుకైనోడే. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు.తండ్రి కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని నడిపేవాడు. తల్లి ఇంటి పనులతో పాటు కుట్టుపని చేసేది.వాళ్లిద్దరికీ తమ కొడుకే లోకం.

"కొడుకు బాగుంటే కోటి రూపాయలెందుకు?" అని తల్లి ఎప్పుడూ అనుకునేది.

చరణ్ కూడా మొదట్లో తల్లిదండ్రుల మాట జవదాటేవాడు కాదు.బడికి సక్కగా పోయి,వచ్చి చదువుకునేవాడు.

ఒక రోజు స్కూల్ అయిపోయినంక చరణ్‌కి అతని స్నేహితుడు విక్కీ ఎదురయ్యాడు.

"ఏరా చరణ్! రోజూ చదువు....చదువు అంటావ్.ఇవాళ మాతో ఒక్కసారి రా.మస్తు ఎంజాయ్ చేద్దాం" అన్నాడు.

"ఎక్కడికి?" అడిగాడు చరణ్.

"అది నీకెందుకురా! మా ఫ్రెండ్స్ అంతా అక్కడుంటరు."

చరణ్ మొదట భయపడ్డాడు.కానీ స్నేహితుల ఒత్తిడికి లొంగిపోయాడు.

అక్కడ కొందరు యువకులు పొగ తాగుతూ,మత్తు పదార్థాలు తీసుకుంటూ కనిపించారు.

"ఇది ఒక్కసారి తీసుకుంటే ఏం కాదు రా....అరచేతిలో వైకుంఠం చూపిస్తది" అంటూ విక్కీ ప్రలోభపెట్టాడు.

చరణ్‌కి లోపల ఎక్కడో భయం మొదలైంది.

"వద్దురా....మా అమ్మకు తెలిస్తే బాధపడుతుంది" అన్నాడు.

"అయ్యో! నువ్వేమన్నా చిన్నపిల్లవా? ఎవరికీ తెలీదు."

స్నేహితుల మాటలకు చరణ్ ఆ రోజు తప్పు అడుగు వేశాడు.

ఆ ఒక్క అడుగు....అతని జీవితాన్ని తలకిందులు చేసింది.

మత్తు మొదలైంది....మార్పు కనిపించింది

మొదట్లో చరణ్ అప్పుడప్పుడు మాత్రమే వెళ్లేవాడు. తర్వాత రోజూ వెళ్లడం మొదలుపెట్టాడు. ఇంటికి ఆలస్యంగా రావడం, తల్లిదండ్రులతో మాట్లాడకపోవడం, చదువుపై శ్రద్ధ తగ్గిపోవడం మొదలయ్యాయి.

తల్లి గమనించింది.

"ఏందిరా నాన్నా.....ఈ మధ్య నీ కళ్లల్లో కళ కనిపించట్లేదు. బడికి పోతున్నావా? చదువుతున్నావా?" అని అడిగింది.

"అమ్మా! నన్ను ఒక్కసారి ఒంటరిగా వదిలేయ్!" అంటూ కోపంగా అరిచాడు చరణ్.

తల్లి గుండె పగిలింది.

"కన్న కొడుకు కడుపులో ఉన్న మాట కన్న తల్లికి తెలియదా?" అనుకుంది.

తండ్రి కూడా కొడుకు ప్రవర్తన చూసి బాధపడ్డాడు.

"బిడ్డా! చెట్టు చిన్నప్పుడే వంచాలి.ఇప్పుడే నీ జీవితం సక్కదిద్దుకో.చెడ్డ స్నేహాలు వదిలేయ్" అన్నాడు.

కానీ చరణ్ వినలేదు.

ఒక రోజు డబ్బుల కోసం తల్లిని అడిగాడు.

"నా దగ్గర లేవురా" అంది తల్లి.

"డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లో ఉండను!" అంటూ చరణ్ బయటికి వెళ్లిపోయాడు.

ఆ తల్లి కన్నీళ్లతో దేవుడి ముందు కూర్చుంది.

"నా బిడ్డకు ఏమైంది దేవుడా?"

బడి గురువు మాట

మరుసటి రోజు చరణ్ స్కూల్‌కి వెళ్లలేదు.

తెలుగు గురువు శేఖర్ సార్‌కి విషయం తెలిసింది. ఆయన చరణ్ తండ్రిని పిలిపించి మాట్లాడాడు.

"చరణ్ చెడ్డోడు కాదు.చెడ్డ దారిలోకి జారిపోయాడు. పిల్లవాడి అడుగు తప్పితే తిట్టడం కాదు.....చేయి పట్టుకుని దారి చూపాలి."

ఆ సాయంత్రం సార్ చరణ్‌ను ఒంటరిగా పిలిచాడు.

"చరణ్! నువ్వు నాకు నిజం చెప్పు.డ్రగ్స్ తీసుకుంటున్నావా?"

చరణ్ తల వంచుకున్నాడు. కళ్లలో నీళ్లు తిరిగాయి.

"సార్.....మొదట సరదాగా మొదలుపెట్టాను.ఇప్పుడు వదులుకోలేకపోతున్నాను."

గురువు అతని భుజంపై చేయి వేసి అన్నాడు.

"బిడ్డా.....!మంట చిన్నదిగా ఉన్నప్పుడే ఆర్పాలి. పెద్దదయ్యాక ఇల్లు కాలిపోతుంది.నువ్వింకా చిన్నవాడివి.నీ జీవితం ముందుంది."

చరణ్ మౌనంగా విన్నాడు.

"నీ అమ్మానాన్నలు నీ కోసం కష్టపడుతున్నరు.వాళ్ల కళ్లలో నీ మీద ఉన్న ఆశను ఒక్కసారి గుర్తు చేసుకో."

ఆ మాట చరణ్ గుండెల్లో బలంగా తగిలింది.

అమ్మ కన్నీరు.....కొడుకులో మార్పు

ఆ రాత్రి ఇంటికి వచ్చిన చరణ్ తల్లి వంట చేస్తోంది.

చరణ్ ఆమె దగ్గరికి వెళ్లాడు.

"అమ్మా....."

తల్లి వెనక్కి తిరిగి చూసింది.

"ఏమయ్యా?"

"నన్ను క్షమించమ్మా...."

తల్లి చేతిలోని గరిటె కిందపడిపోయింది.

"ఏమైంది నాన్నా?"

చరణ్ తల్లి ఒడిలో తల పెట్టి ఏడ్చాడు.

"అమ్మా....నేను తప్పు చేశా. డ్రగ్స్ తీసుకున్నా.నిన్ను బాధపెట్టా.నాన్నను బాధపెట్టా.ఇక మీదట ఆ మత్తు జోలికి పోను".

తల్లి కన్నీళ్లతో కొడుకును గట్టిగా కౌగిలించుకుంది.

"తల్లి ఒడే అసలైన స్వర్గం రా బిడ్డా!.నీకు మత్తు కాదు.....మా ప్రేమే కావాలి."

తండ్రి కూడా దగ్గరకు వచ్చి కొడుకు తలపై చేయి పెట్టాడు.

"తప్పు చేసినోడు చెడ్డోడు కాదు......తప్పు తెలిసి మార్చుకోనోడే అసలైన చెడ్డోడు.నువ్వు మారాలని అనుకున్నావు.అదే నీ మొదటి విజయం."

ఆ రోజు నుంచి చరణ్ చికిత్స,కుటుంబ సహాయం,గురువు మార్గదర్శకత్వంతో మత్తు పదార్థాలకు దూరమయ్యాడు.చెడు స్నేహాలను వదిలేశాడు. మళ్లీ చదువుపై దృష్టి పెట్టాడు. కొన్ని నెలల తర్వాత పాఠశాలలో "డ్రగ్స్ రహిత విద్యార్థి సమాజం" అనే కార్యక్రమం జరిగింది.

అందరి ముందు చరణ్ మాట్లాడాడు.

"స్నేహితులారా! డ్రగ్స్ మొదట మిత్రుడిలా కనిపిస్తాయి.చివరికి మన జీవితాన్నే దోచుకుంటాయి. ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదనుకోవడం పెద్ద పొరపాటు.నిప్పుతో చెలగాటమాడితే చేతులు కాలకుండా ఉంటాయా?

మనకు నిజమైన ఆనందం మత్తులో లేదు. అమ్మానాన్నల నవ్వులో ఉంది.గురువుల ఆశీస్సుల్లో ఉంది. చదువులో ఉంది.మన భవిష్యత్తులో ఉంది.

డ్రగ్స్ మత్తు వదులు... అమ్మా నాన్నలే ముద్దు!"

విద్యార్థులంతా ఒక్కసారిగా నినదించారు.

"డ్రగ్స్ వద్దు.....జీవితం ముద్దు!"

"చెడు స్నేహం వద్దు..... మంచి భవిష్యత్తు ముద్దు!"

"మత్తు వద్దు...... అమ్మానాన్నల ప్రేమ ముద్దు!"

చరణ్ తల్లి,తండ్రి వెనుక నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తూ కన్నీళ్లతో నవ్వారు.



డా.ఓర్సు రాజ్ మానస
తెలుగు అధ్యాపకులు, ధర్మపురి
9849446027

## ఆదర్శం

కన్నీళ్ల సుడులను
కనిపించనీయకుండా,
కష్టాల కడలిని
నవ్వుతూ దాటుతూ...
వేసవికి పుడమి
నెర్రలు విడిచినట్లు,
పాదాలు కమిలి పగిలినా
నడకను ఆపక...
చెమట చుక్కలను
ముత్యాలుగా మార్చి,
శ్రమనే తమ ఇలవేల్పుగా నమ్మి,
పగలు రేయి అనక
రెక్కలు ముక్కలు చేసుకుంటూ...
ఆకలి మంటలను
గుండెల్లోనే దాచుకుని,
ముద్దనోటి దాకా రాకపోయినా
మా చిరునవ్వుల కోసం తపిస్తూ...
ఏనాడు జీవన
నౌకను విడువక,
కడుపున పుట్టిన బిడ్డలకు
కష్టమే తెలియకుండా
రెక్కల కింద కాపాడుతూ...
ప్రేమనే అమృత భాండంగా
అందించిన
మా అవ్వ, అయ్యల జీవితమే
నాకు నిత్య ఆదర్శం!

గంజి.కుమార్ రాజా,
పరిశోధక విద్యార్థి,
7730896943.

## దృష్టాంతం

పుట్టుటకు గిట్టుటకు
మధ్యలో సంధికాలం
బతుకు చక్ర భ్రమణం
నాటకీయ పరిణామం

బహురూపుల బతుకే
బొమ్మలాటల రూపకం
బహు ముఖకవళికలే
ఈ ప్రదర్శనకు ప్రేరకం

ప్రప్రథమ పర్వం నుండి
చిట్టచివరి ఘట్టం వరకు
పాత్రనిడివి తగ్గిన గానీ
అజరామర కీర్తి కిరీటం

బతుకు భారోపజీవనం
నటనే దీనికి నిదర్శనం
ఎత్తిన తెర దించే దాక
నటించాలి జీవించాలి

సన్నివేశానికి తగు వేషం
కుదురుతే మహా విశేషం
తగ్గట్టు లేకుంటే ఎబ్బెట్టు
రక్తికి బదులు విరక్తి పుట్టు

బతుకే ఒక వృత్తాంతం
నాటకమే ఓ దృష్టాంతం
రెంటింటి సమీప దృక్కోణం
నిరూపణకు ఒక తార్కాణం

కనపర్తి రాజశేఖరమ్
- 7382847673

## వెలుగుల నగరంలో చీకటి బతుకులు

పల్లె నా పేరు
పరగడుపు నా చిరునామా
వలసెందుకొచ్చానో వలలోన చిక్కాను
కూటికి గతిలేక వలపోత మిగిలెను
ఉన్న అద్దెకర అమ్ముకొని
ఇంటిల్లిపాదిని వెంటేసుకొచ్చాను
గూడెం గుడిసెలో ముసల్దాన్ని ఇడిచి
గుప్పెడు మెతుకుల కోసం
అమ్మను తలుచుకొని పట్నానికొచ్చిన

ఊరడిగిరి, పేరడిగిరి
చివరాఖరికి కులమడిగిరి
చెప్పులు కుట్టిన చేతులకు
చెప్రాసి పనే మేలని చెవులు పిండిరి
డ్రైనేజీ మురికే నీకు దిక్కనిరి
ముక్కు మూసుకొని మోరీ సాపు చేసి
కూలెంతని అడిగితే కుతికె పిసికిరి
కుదరదని తిరగబడితే కుక్కలా గెదిమిరి

ఇంటిదానికి తొందర పని దొరికి
బాసండ్లు తోమనికే బానిసై పోయింది
పెద్దోడు అద్దె ఆటో నడపవట్టే
చిన్నోడు బైక్ మెకానిక్ పని పట్టే
పిల్లొక్కతే గౌరుమెంట్ బడికి
కిరాయికి ఇల్లడిగితే గెంటేసినట్టే
పెద్ద మేస్త్రి ఇల్లిచ్చి కూలిచ్చి దేవుడాయే
పొట్ట చేత పట్టుకుని పట్నం వచ్చిన నాకు
కుదురుగా ఉండడానికే ఏడాది పట్టే...

నగరం అంటే నవ్విస్తదనుకుంటి
నడి నెత్తిన తన్నిస్తదనుకోలే
సిమిటి సంచెత్తుకొని ఈపు కాయగాయంగా
నాలగంత్రాలు మోపిస్తదనుకోలే
మోరీల మురికంత, పాయఖాన కంపంతా
నిలువెల్ల పూయిస్తదనుకులే
బాధంతా మరువనింకే
కల్లు కాంపొండే కన్న తల్లయితదనుకోలే

పటేలో, సావుకారో, పెద్ద మేస్త్రో
పండ్లు పటపట కొరికి
ఆకలి కడుపు మీద తన్నినప్పుడు
కల్వరి కడుపు నింపింది నిజం
కంట్రోలు బియ్యం ఖతమైనప్పుడు
కాయగూరలకు ఖజానా కరువైనప్పుడు
పెద్దమ్మ తల్లి చేరదీసింది సత్యం
కాళ్ళు చేతులు వణికి లేవలేని నాడు
షఫీ ఫకీరు తాయిత నయం చేసింది వాస్తవం

చాంద్రాయణ గుట్ట కాడా కూలి కోసం పడిగాపులు
పని దొరకనింకే బ్రోకర్ గాడికి పొర్లు దండాలు
అప్పుడప్పుడు వాడి చూపులకు లొంగే రోజులు
మియాపూర్ చౌరస్తాలో పూలనమ్మే పసిచేతులు
పెద్దోళ్ల కోసమే ఈ సువాసనలు అంటూ నిరాశలు
బంజారాహిల్స్ లో భవనాలు కట్టిన మేస్త్రీలు
సొంత గూటిలోనేమో వాన పొట్కులు
చింతల్ బస్తీ చెత్త కుండీల్లో బువ్వ కోసం ఆరాటం
కూకట్పల్లి సిగ్నల్ అంచున పెన్నులమ్ముతూ
సంకల పిల్లనెత్తుకొని పాలిపోయిన ముఖంతో
ముసల్దాన్ని చూసి ఎక్కెక్కి ఏడ్చి మా కంటే
దీనంగా బతుకుతున్నరని బాధపడిన...

బావర్చి బిర్యానీ తిందామని ఆశలు
కబీర్ బాబా కళ్యాణి బిర్యానీతో సర్దుబాట్లు
కరాచీ బేకరి కి పోలేని మా బతుకులు
సిటీ బేకరిలోకే మా పాప అడుగులు

ట్రెండ్స్, మ్యాక్స్, జూడియో లు మాకెందుకు
బొంబాయి షాపింగ్ మాల్ లో అగ్గువకు అంగీలు
ఓనరామే కసురుకున్నా బండెడు బట్టలుతికే
పని మీదికి పాత బట్టలు ఇంటామె తెస్తనే ఉండే
ఆటో టక్కరించిండని ఏడాది పైసల్ దండుగ కట్టిస్తి
పెద్దోడు కూడా సంట్రింగ్ పనికి పోవట్టే...

ఊరే మంచిగుండే
కక్కయ్య, చిన్నమ్మ అనుకుంట
బావ, మావ అనుకుంట ఎప్పుడూ సందడే
మెరుపొడి బువ్వ తిన్నా కూడా
హాయిగా నిద్ర పోతుంటిమి
గుంట భూమి ఉన్నా తినడానికిన్ని
మెతుకులు దొరికే ధాన్యలక్ష్మి ఊరు..
కరువొచ్చి కటకటాల్లోకి వచ్చినట్టు
పుట్టెడు దుఃఖంతో పట్నానికొస్తే
బండెడు బాధల్నిచ్చి బరువెక్కించింది...

హైటెక్ సిటీ, గచ్చిబౌలి లైట్ల వెలుగుల్లో
మాకుండడానికి అర్హత లేదని తెలిసిపాయే
మా బతుకులు మసి బొంతలోలె మురికే అని
జూబ్లీహిల్స్ రోడ్లు సైతం వెక్కిరిస్తున్నాయి
అద్దాల మేడల్లో అడుగు పెట్టే అదృష్టం లేనోడు
హైదరాబాదుకు రావొద్దని చెప్పకనే చెప్తున్నాయి
పనికి పనితనానికి మాత్రమే విలువనిచ్చే పట్నంల
మనిషికి మానవత్వానికి చోటెక్కడిది...

ఓటరుగా మాత్రమే మమ్మల్ని చూసే రాజకీయం
రాజును కానిస్తుందా? రాజ్యమేలనిస్తుందా?
కూలీ కోసం కోటి తిప్పలు పడే మా జాతులకు
కోట్లకు పడగేలేత్తే రోజులు కలల బచ్చాలే
కాగితాలు ఏరుకునే మా పిల్లలకు
కార్మేంటు చదువులు కానరాని దూరం
ట్యాంకుబండ్ కాడా బుద్ధుడు బుద్ధులు
నేర్పిన మా మెదడుకు ఎక్కెదెన్నడు
అంబేద్కర్ వేలెత్తి చదువును చూపినా
మనువు మా నెత్తి మీద కూసుంటే ఇంకేడబ్బుతది.

మా జీవితాలు చీకటిలో ఉన్న సరే కానీ
మా పిల్లలకు ఈ మబ్బు కమ్మనియ్యం
చదువుల వెలుగులు మా బిడ్డలకు ఇచ్చి
మా జాతుల జాడ్యాన్ని వదలగొట్టే రోజు వస్తది
ఈ గూడెం బిడ్డలే ఈ దేశమేలే గడియ వస్తది
నా కొడుకు ఆటో బంజేసి కాలేజీ కి పోతుండు
చిన్నోడు పదిట్ల ఫస్ట్ క్లాస్ పాసయ్యిండు
నా బిడ్డ కలెక్టర్ అయితని లక్ష్యం పెట్టుకున్నది

మాకు ఈ మధ్యనే అంబేద్కర్ వాదులు కలిసిన్రు
మహనీయులను పరిచయం చేసింన్రు
చదువు విలువ చెప్పి మా కళ్ళు తెరిపిచ్చిరు
చదువుకుంటేనే మన బతుకులు మారుతాయని
చదువే మన బిడ్డల రేపటి భవిష్యత్తు అని
కులం, మతం రూపాన్ని ఇప్పి చెప్పిరు
ఇగ సావనైన సస్తం కానీ పిల్లల చదివిస్తం
అంబేద్కర్ బాటలో పయనిస్తాం
రేపటి సూర్యులను తయారు చేస్తాం.



ఎర్రోళ్ల ఆంజనేయులు
సీనియర్ రీసెర్చ్ స్కాలర్
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

## కేజీల లీలలు... మేల్కొన్న యువతరం

ఆరో తరగతి నుంచే మొదలైన తపస్సు
కార్పొరేట్ గోడల మధ్య నలిగిన యవ్వనం
డాక్టరై నలుగురి ప్రాణాలు కాపాడాలని
రాత్రింబవళ్లు పుస్తకాలతో సాగించిన యుద్ధం

అమ్మ నగలు తాకట్టు పెట్టి ఫీజులు కట్టారు
నాన్న అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో చేర్చారు
ర్యాంకు వస్తేనే జీవితం అన్న ఒత్తిడి మధ్య
ఊపిరి బిగబట్టి రాశారు 'నీట్' పరీక్ష నీటుగా

కేటుగాళ్ల దందాలో బలైన పరీక్షపేపరు ...
కష్టపడి చదివినోడికి మిగిలింది శూన్యం
కోట్లకు పేపర్లు కొన్నోడికి దక్కింది సీటు
లీకేజీల మాఫియా చేతిలో చిక్కుకున్నభవిత
నమ్మకం కోల్పోయి నడిరోడ్డున నిలిచిన ప్రతిభ

ఇది కేవలం ఒక ప్రశ్నపత్రం లీకేజీ కాదు
యువత నమ్మకంపై జరిగిన హత్యాకాండ
అసమర్థ ప్రభుత్వాల అసహాయతకు నిదర్శనం

ఒక విద్యార్థి పడిన కఠోర శ్రమకు సమాధి
వైద్యుడవ్వాలన్నపవిత్రమైన ఆశపై
అవినీతి ఆంబోతులు విసిరిన పంజా

కంటిపాపల్లాంటి పిల్లల భవిష్యత్తును నడిబజారులో
తాకట్టు పెడుతూ మార్కుల మార్కెట్లో వారి కలలను
తూకం వేస్తూ తుదముట్టించారు
న్యాయం కోసం వేచి చూసే ఓ యువతరమా...
ముసలి రాజకీయాలకు ముగింపు పలకడానికి
ముందుకొచ్చిన మీకు జేజేలు పలుకుతుంది ఈ దేశం !



న్యాలకంటి నారాయణ
ఫోన్ 9550833490

## ఉదయ భానుడు

అవని పై అవతారం దాల్చిన
అపర మేధావి అంబేద్కర్
అంటరానితనం పై పూరించిన
సమర శంఖారావం అంబేద్కర్

దళిత జాతి హక్కుల రక్షణ కోసం
ఆయనది అలుపెరుగని పోరాటం
అవమానాలు, అవ హేళనలపై
తిరగబడ్డ బావుటా అంబేద్కర్

బడుగు బలహీన వర్గాల
జీవితాలలో వెలుగు రేఖ
అగ్రవర్ణ ఆధిపత్యాన్ని
మనువాదుల దురా గతాలను
వ్యతిరేకించిన తీవ్రవాది

మిడిసిపడే నియంతృత్వం పై
ఎగిసి పడ్డ కెరటం అంబేద్కర్
తర తరాల శ్రమ దోపిడి పై
నిరసించిన ప్రతిఘటనా పిడికిలి

పోరాట తత్వాన్ని మన
రక్తంలోకి వంపినవాడు
ప్రగతికి పునాదులు వేసి
దారి చూపిన చైతన్య ప్రతీక

ఛాందస భావాలపై సమరం
చాటింపజేసిన ధీరుడు
అణగారిన బ్రతుకులలో
ఉదయభానుడు అంబేద్కర్
రేపటి తరం జాతి నిర్మాత

భారత రాజ్యాంగ రూపశిల్పి
ప్రజాస్వామ్య పరి రక్షకుడు
పీడిత జనుల పక్ష పాతి
భారతరత్నం మన అంబేద్కర్



బాసరాజు యాదగిరి
ఉపాధ్యాయుడు
9866255775

## అంగడి బొమ్మలు!

నేడు ప్రతి మనిషీ...
ఓ వ్యాపార ప్రకటనల బోర్డే!

విలువలకు కాలం చెల్లి,
వెలలకు మాత్రమే మన్నిక పెరిగిన చోట...
ఆకలి కేకల కంటే,
కమిషన్ చప్పుడు మాత్రమే శ్రావ్యంగా వినిపిస్తుంది!

సిద్ధాంతాల సంచులు ఖాళీ చేసి,
స్వార్థపు నాణేలు నింపుకునే
రాజకీయ వ్యాపారులకిక్కడ...
ధర్మం అంటే కేవలం డిస్కౌంట్ సేల్!

చట్టాల పంజరంలో
న్యాయం పక్షిలా విలవిలలాడుతుంటే...
పైసల సంచులు మోసేవారు మాత్రం,
స్వేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నారు!

కళ్ళముందే దోపిడీ జరుగుతున్నా,
సమస్యల సుడిగుండాల్లో చిక్కుకున్న జనం
మౌనంగా వీక్షిస్తూ ఉంటే...
అవినీతి మహావృక్షం,
తన ఊడలను ఇంకా లోతుగా నాటుతుంది!

చైతన్యం కేవలం పుస్తకాలకే పరిమితమైతే,
ప్రశ్నించే గొంతుకలు మూగబోతే...
ఈ వ్యవస్థ ఎప్పటికీ,
ఒక మురికి కాలువగానే మిగిలిపోతుంది!

పరిష్కారం ఓట్ల కొనుగోలులో లేదు...
కళ్ళు తెరిచే పౌరుడి చైతన్యపు అడుగులోనే ఉంది!

లంచం ఇవ్వడం నేరం,
పుచ్చుకోవడం ఘోరం!
నీతి నిజాయితీల సమర శంఖారావంతో,
అవినీతి మూలాలు పెకలించినప్పుడే...
నిజమైన ప్రగతి భాస్కరుడు ఉదయిస్తాడు!



బూరెడ్డి రామకృష్ణారెడ్డి,
భద్రాద్రి కొత్తగూడెం,
పాల్వంచ.

సాహిత్య లహరి
SAHITYA LAHARI
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 16-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## భారతీయ సాహిత్యం

# వేదాల్లోని ప్రతీకాత్మకత

"నిజం చెప్పొద్దూ
మనుధర్మాలు వాత్స్యాయన కామసూత్రాల్లా అనిపించేవి
దేవుడి నాలుగు శరీర మర్మాలూ
అశ్లీలభావచిత్రాల్లా కనిపించేవి
నా జన్మరహస్యం మీశాస్త్రాల్లో రాయనందుకు
నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణే
శాపనార్థాలు దొరకనప్పుడల్లా
నా తల్లి మాటే మీ నోట్లో నానుతుండేది
పోనీలెండి, దూషణలోనైనా
నాతల్లికే నేను పుట్టానని
ఖరారు చేశారు
ముమ్మాటికీ మేం తల్లికి పుట్టిన బిడ్డలమే"

అని ప్రముఖ కవి సతీష్ చందర్, పంచమవేదం కవితలోని ఒక భాగమిది. చాతుర్వర్ణ్య సిద్ధాంతంలో పంచములు లేరు. శూద్రుల వరకే ఉన్నారు. కానీ, అనేక వర్ణాలు కలిసిన వార్ని మళ్ళీ రకరకాల వర్ణాలు, కులాలుగా శాస్త్రాలు వర్ణించాయి. ఈ సిద్ధాంతానికి మూలం వేదాలు. అది కూడా ఋగ్వేదంలోని దశమ మండలంలో గల ప్రసిద్ధ పురుష సూక్తంలో కనిపిస్తుంది. వేదాలు సంస్కృతంలో అత్యంత గూఢమైన, ప్రతీకాత్మకమైన భాషలో వెలువడ్డాయి. వేద కాలం నాటికి ఆ ప్రతీకల వెనుక ఉన్న అంతరార్థం మహర్షులకు తెలుసు. కానీ కాలం గడిచేకొద్దీ సంస్కృత భాష ప్రజలకు దూరమవడం, రూపకాలను నేరుగా అక్షరాలా అభిదార్థంలోనే అర్థం చేసుకోవడం ప్రారంభం కావడం వల్ల తీవ్రమైన వక్రీకరణలు చోటుచేసుకున్నాయి.

నేను అక్షరాల మధ్య
మనిషిని వెతుకుతున్నాను.
కాలం దాచిన ప్రశ్నలకు
సమాధానాల్ని వినాలనుకుంటున్నాను.
ప్రతి మాటకు మతంతో పెట్టడమేనా
నా ప్రశ్నకు వర్ణాల రంగుపూయడమెందుకు?

వేదాలన్నీ మంత్రాల రూపంలో ఉన్నాయి. అవి ప్రత్యేకమైన పద్ధతిలో అధ్యయనం చేస్తే తప్ప ఆ అంతరార్థాలు సులభంగా అవగాహన కాదు. అవి విశ్వ రహస్యాలను, ప్రకృతి ధర్మాలను, మానవ అంతరంగాన్ని అత్యంత గూఢమైన ప్రతీకల ద్వారా దర్శించిన అద్భుతమైన విజ్ఞాన భండారాలు. బాహ్య విశ్వాన్ని, మానవ శరీర తత్త్వాన్ని వేరువేరుగా చూడకుండా, రెండింటి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వేద రుషులు ఒకే సజీవ శక్తి క్షేత్రంగా ఆవిష్కరించారు. ఈ తాత్త్విక దృక్పథానికి 'పురుష సూక్తం' వంటి ప్రసిద్ధ వేద సూక్తాలు నిలువెత్తు ప్రతీకలుగా నిలుస్తూ, సృష్టి ఆవిర్భావాన్ని, సమాజంలోని విభిన్న శక్తులను ఒకే మహా చైతన్యపు అంగాలుగా సుందరంగా వర్ణిస్తున్నాయి. అయితే, కాలక్రమేణా మారుతున్న సామాజిక-రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ఈ వేద ప్రతీకల వెనుక ఉన్న అంతరార్థం మరుగైపోయి, స్వార్ధ ప్రయోజనాల కోసం అవి తీవ్రమైన వక్రీకరణలకు గురయ్యాయి. శ్రమ విభజన ఆధారంగా సాగిన సహజమైన వ్యవస్థను, తరువాతి కాలపు స్మృతి గ్రంథాలు జన్మ ఆధారిత కుల వ్యవస్థగా మార్చివేయడంతో వేదాల అసలైన సమైక్యతా భావన తెరమరుగైంది. ఈ నేపథ్యంలో, పురుష సూక్తంలోని మూల తత్త్వాన్ని, గీత బోధించే గుణ-కర్మల సిద్ధాంతాన్ని ఆధునిక శాస్త్రీయ, మానవతా దృక్పథంతో పునరావగాహన చేసుకుంటూ, వేదాల అసలు సిసలు సద్భావనను వెలికితీయడం నేటి కాలానికి ఎంతో అవసరం. అప్పుడు మాత్రమే వేదాల ప్రభావం భారతీయ సాహిత్యంపై చూపిన ప్రభావాన్ని గుర్తించగలుగుతాం. ఋగ్వేదంలోని దశమ మండలంలో గల ప్రసిద్ధ పురుష సూక్తంలో విరాట్ పురుషుని (విశ్వ స్వరూపుడైన పరమాత్మ) రూపం నుండి యావత్ సృష్టి ఎలా ఉద్భవించిందో వర్ణించారు.

"చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత
ముఖాదిన్ద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత
నాభ్యా ఆసీదంతరిక్షం శీర్ష్ణో ద్యౌః సమవర్తత
పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రాత్తథా లోకా అకల్పయన్
బ్రాహ్మణోఽస్య ముఖమాసీద్బాహూ రాజన్యః కృతః
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత "

అనే ఈ శ్లోకంలోని కొంతభాగాన్నిమాత్రమే మనం సాధారనంగా ఉదాహరించడాన్ని చూస్తుంటాం. ఈ మంత్రం లేదా శ్లోకంలోని తత్వం అవగాహన కావాలంటే బహుశా పూర్తి శ్లోకాన్ని అర్థం చేసుకోవాలేమో అనుకుంటున్నాను. ఈ సంపూర్ణ శ్లోకం ద్వారా భౌతిక విశ్వం, ఖగోళ శక్తులు, సామాజిక వ్యవస్థ ఒకే దివ్య చైతన్యపు అంగాలుగా వర్ణించారు. ఇందులో పరమాత్మ మనస్సు నుండి చంద్రుడు, కన్నుల నుండి సూర్యుడు, ముఖం నుండి అగ్ని-ఇంద్రులు, ప్రాణం నుండి వాయువు జన్మించగా; నాభి నుండి అంతరిక్షం, తల నుండి ఆకాశం, పాదాల నుండి భూమి , చెవుల నుండి దిక్కులు ఏర్పడ్డాయని స్పష్టంగా వివరించేప్రయత్నం చేశారని తెలుస్తుంది. ఈ శ్లోకాల అంతరార్థం కేవలం భౌతిక సృష్టిని వివరించడమే కాకుండా, సమాజంలోని విభిన్న విభాగాలు, సమస్త ప్రకృతి మూలకాలు ఒకే మహా వ్యవస్థలో అంతర్భాగమని మహర్షులు చెప్పాలనుకున్నారు. శ్లోకం చివరి భాగంలో విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణుడు, చేతుల నుండి క్షత్రియుడు, తొడల నుండి వైశ్యుడు, పాదాల నుండి శూద్రుడు ఉద్భవించారని తెలపడం ద్వారా సమాజ నిర్మాణానికి జ్ఞానం, రక్షణ, ఆర్థిక వ్యవస్థ , శ్రామిక శక్తి ఎంతలా అవసరమో ప్రతీకాత్మకంగా చెప్పేప్రయత్నం చేశారు. అంటే, సూక్ష్మ రూపంలో ఉన్న మానవ శరీర ధర్మమే స్థూల విశ్వంగా విస్తరించిందనే 'యూనిఫైడ్ కాస్మిక్ ఆర్డర్' సిద్ధాంతానికి ఈ సంపూర్ణ శ్లోక వర్ణన నిలువెత్తు ప్రతీకగా నిలుస్తుంది.

పురుష సూక్తంలోని ఈ శ్లోకాన్ని ఆధునిక కాలంలో కేవలం ఒక కుల వ్యవస్థకు, సామాజిక అణచివేతకు లేదా అసమానతలకు మూలసృష్టిగా అర్థం చేసుకోవడం ఒక చారిత్రక , తాత్విక పొరపాటేమో అనిపిస్తుంది. ప్రాచీన వేద కాలంలో ఏనాడూ ఈ శ్లోకం జన్మతః వచ్చే కులాల నిచ్చెనమెట్లను లేదా హెచ్చుతగ్గులను సూచించడానికి పుట్టలేదు. దీన్ని సరిగ్గా, సమగ్రంగా అవగాహన చేసుకోవాలంటే కొన్ని మౌలిక అంశాలను పరిశీలించాలి. ఈ




శ్లోకంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు వేర్వేరు వ్యక్తులుగా పుట్టలేదనీ, ఒకే ఒక 'విరాట్ పురుషుని' (విశ్వ స్వరూపుడైన పరమాత్మ) శరీరంలోని విభిన్న అవయవాల నుండి ఉద్భవించారని స్పష్టంగా చెప్పబడింది. అంటే మానవ శరీరంలో ముఖం ఎంత ముఖ్యమో, పాదాలు కూడా అంతే ముఖ్యం. ఏ ఒక్క అవయవం లేకపోయినా శరీరం నడవదు. కాబట్టి ఈ నాలుగు వర్గాలు ఒకే శరీరం (సమాజం) యొక్క పరస్పర ఆధారిత అవయవాలే తప్ప, ఒకరిని మించి మరొకరు గొప్పో తక్కువో కాదని చెప్పడమే దీనిలోని పరమార్థం. **సమాజం అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందడానికి శ్రమ విభజన తప్పదు. అయితే అది జన్మ గీత కాదని వివరించడంలో ఒక వైఫల్యం, లోపం కనిపిస్తుంది.** సమాజ నడకకు జ్ఞానం (ముఖం/బ్రాహ్మణ), రక్షణ (బాహవు/క్షత్రియ), ఆర్థిక పోషణ (ఊరువు/వైశ్య), శ్రమ-ఉత్పత్తి (పాదాలు/శూద్ర) ఎలా ప్రాణాధారమో దీన్ని ఒక మనిషిగా, ఒక వ్యవస్థగా పోల్చారు. కాలక్రమేణా తరువాతి కాలపు స్మృతులు, పురా ణాలు, సామాజిక రుగ్మతల ప్రభావం వల్ల ఈ కర్తవ్య ఆధారిత వ్యవస్థను 'జన్మ ఆధారిత కుల వ్యవస్థగా' మార్చడమే అసలు పొరపాటుకు కారణమైంది.

దీనిని ఆధునిక కాలంలో సరిగ్గా అర్థం చేసుకోవాలంటే దీన్ని ఒక మతపరమైన అంశంగా కాకుండా, ఒకే సమాజ శరీరంలో అందరూ సమాన భాగస్వాములేననే **సమగ్ర సామాజిక సమైక్యతా తత్వంగా** భావించాలనుకుంటున్నాను. శరీరంలోని ఏ అంగం లేకపోయినా అంగవైకల్యం ఏర్పడినట్టే, సమాజంలో ఏ వర్గం లేకపోయినా వ్యవస్థ కుంటుపడుతుందనే విశాలమైన, శాస్త్రీయమైన మానవతా దృక్పథంతోనే ఈ శ్లోకాన్ని పునరావగాహన చేసుకోవాలి. పురుష సూక్తంలో వర్ణించబడిన సంపూర్ణ సృష్టి ఆవిర్భావాన్ని , సమాజ నిర్మాణాన్ని ఆధునిక శాస్త్రీయ, తాత్విక దృక్పథంతో సమన్వయం చేసినప్పుడు, వేదాల దార్శనికత ఎంతటి అద్భుతమైనదో స్పష్టమవుతుంది.

"చంద్రమా మనసో జాతః
చక్షోః సూర్యో అజాయత|
ముఖాదిన్ద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత ||"

ఈ శ్లోకంలో పరమాత్మ మనస్సు నుండి చంద్రుడు, కన్నుల నుండి సూర్యుడు ఉద్భవించారని చెప్పడం ఆధునిక శాస్త్రవిజ్ఞానంతో ముడిపెట్టి చెబుతున్నారు. బాహ్య ప్రపంచంలో కాంతిని ఇచ్చే సూర్యుడు, చల్లదనాన్ని ఇచ్చే చంద్రుడు మానవ శరీరంలోని ఇంద్రియాలకూ, మనోభావాలకూ సరిగ్గా ప్రతిరూపాలు కనిపిస్తాయి. అలాగే ముఖం నుండి అగ్ని-ఇంద్రులు, ప్రాణం నుండి వాయువు వచ్చాయనడం శరీరంలోని జీవక్రియల ఉష్ణం , శ్వాస వ్యవస్థ అనేవి విశ్వంలోని అగ్ని, వాయు శక్తుల భౌతిక రూపమేనని నిరూపిస్తుంది.

"నాభ్యా ఆసీదంతరిక్షం శీర్ష్ణో ద్యౌః సమవర్తత |
పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రాత్తథా లోకా అకల్పయన్ ||"

ఈ శ్లోకంలో తల ఆకాశంగా, నాభి అంతరిక్ష కేంద్రంగా, పాదాలు భూమిగా వర్ణించబడటం ఆధునిక 'హోలోగ్రాఫిక్ యూనివర్స్' సిద్ధాంతాన్ని పోలి ఉంటుంది. భౌతిక శరీరంలో గురుత్వాకర్షణ కేంద్రం నాభి అయినట్లుగానే, విశ్వానికి అంతరిక్షం ఒక కేంద్రం. ఒక జీవి శరీరం ఏ విధంగా అయితే భూమిపై నిలబడి దిక్కులను అంచనా వేస్తుందో, అదే సూత్రం ద్వారా స్థూల విశ్వం కూడా ఒక మహా జీవి వలె రూపుదిద్దుకుందనే అద్భుతమైన వైజ్ఞానిక రూపకంగా కనిపిస్తుంది.

కాలక్రమేణా వేదాలు సమాజంలో కొన్ని వర్గాల చేతిలో కేంద్రీకృతం కావడానికి, మిగతా వర్గాలను విద్యకు, వేదాధ్యయనానికి దూరం చేయడానికి ఈ శ్లోకమే ఒక బలమైన సామాజిక-రాజకీయ ఆయుధంగా ఉపయోగించబడింది. దీనికి గల ముఖ్య కారణాలు , చారిత్రక పరిణామాలు కనిపిస్తున్నాయి.వేద కాలంలో ఒక ప్రతీకాత్మక రూపకంగా, 'శ్రమ విభజన' సూత్రంగా ప్రతీకాత్మకంగా చెప్పిన ఈ శ్లోకాన్ని, తరువాతి కాలంలో స్మృతులు, పురాణాలు , మనుధర్మ శాస్త్రం వంటి గ్రంథాలు అత్యంత కఠినమైన 'జన్మ ఆధారిత కుల వ్యవస్థగా' మార్చేశాయి. శరీరంలో ముఖం పైభాగంలో ఉంటుంది కాబట్టి బ్రాహ్మణుడు శ్రేష్ఠుడని, పాదాలు క్రింద ఉంటాయి కాబట్టి శూద్రుడు అణచివేయదగినవాడని ఒక వక్రీకృతమైన నిచ్చెనమెట్ల సిద్ధాంతాన్ని సృష్టించారు. అంటే ఒక **తాత్విక భావనను రాజకీయ శాసనంగా మార్చిన పరిణామం స్పష్టంగా కనిపిస్తుంది.**

ముఖం నుండి పుట్టారనే వాదనను అడ్డుపెట్టుకుని కేవలం అగ్రవర్ణాల వారికే (ముఖ్యంగా బ్రాహ్మణులకు) మాత్రమే వేదాలు చదివే, నేర్చుకునే, బోధించే సంపూర్ణ హక్కును కట్టబెట్టారు. దీనివల్ల వేదాలలోని అసలైన శాస్త్రీయ, మానవతావాద దృక్పథం మరుగైపోయి, సమాజంలో కేవలం ఆధిపత్య పోరు, వర్గ విభేదాలు వేళ్లూనుకున్నాయి. మిగతా వర్గాలను వేదాధ్యయనానికి, విద్యకు దూరం చేయడం ద్వారా సమాజాన్ని తమ నియంత్రణలో ఉంచుకునే ఒక కుట్రపూరితమైన సామాజిక నిబంధనగా ఈ శ్లోకాన్ని దుర్వినియోగం చేశారని మిగతా వర్ణాలు, ముఖ్యంగా శూద్రవర్ణం వారు భావించారు.

మనుధర్మ శాస్త్రం (మనుస్మృతి) పురుష సూక్తంలోని ఈ ప్రతీకాత్మక రూపకాన్ని అక్షరాలా తీసుకుని, దానిని అత్యంత కఠినమైన, జన్మ ఆధారిత సామాజిక శాసనంగా ఎలా మార్చిందో చారిత్రక, తాత్విక కోణంలో విశ్లేషించడం చాలా ముఖ్యం. వేదాల్లో ఒకే 'విరాట్ పురుషుని' అంగాలుగా, పరస్పర ఆధారిత విధులుగా చెప్పిన ఈ భావనను, మనుధర్మ శాస్త్రకర్తలు ఒకే సమాజంలో హెచ్చుతగ్గుల నిచ్చెనమెట్ల సిద్ధాంతంగా స్థిరపరిచారు. దీనికి సంబంధించిన మనుధర్మ శాస్త్రంలోని కొన్ని శ్లోకాలను చూసినా తెలుస్తుంది. మనుధర్మ శాస్త్రం ప్రథమ అధ్యాయంలో విరాట్ పురుషుని సృష్టిని ప్రస్తావిస్తూ, ప్రతి వర్గానికి వేర్వేరు ధర్మాలను, వృత్తులను జన్మతః శాసించింది.

లోకానాం తు వివర్ధ్యర్థం ముఖబాహూరుపాదతః |
బ్రాహ్మణం క్షత్రియంచ వైశ్యం
శూద్రంచ ముఖతోఽసృజత్ ||

*(సమాజ శ్రేయస్సు కోసం బ్రహ్మ తన ముఖం, బాహువులు, తొడలు , పాదాల నుండి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను సృష్టించాడు - మనుస్మృతి 1-31)* ఈ శ్లోకం ద్వారా వేదాలలోని రూపకాన్ని ఒక చట్టబద్ధమైన సృష్టి రహస్యంగా మలిచారు. దీని కొనసాగింపుగా మనువు వారి విధులను శాసిస్తూ,

అధ్యాపనమధ్యయనం యజనం యాజనం తథా |
దానం ప్రతిగ్రహంచైవ బ్రాహ్మణానామకల్పయత్ ||

*(అధ్యయనం, అధ్యాపనం, యజనం, యాజనం, దానం, ప్రతిగ్రహం తీసుకోవడం బ్రాహ్మణుల విధిగా నిర్ణయించబడింది - మనుస్మృతి 1-88)* అలాగే క్షత్రియులకు రక్షణ, వైశ్యులకు వాణిజ్యం-వ్యవసాయం కేటాయించగా, శూద్రుల గురించి అత్యంత పక్షపాత ధోరణితో

"ఏకమేవ తు శూద్రస్య ప్రభుః కర్మ సమాదిశత్ |
ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషామనసూయయా ||

*(ఈ మూడు వర్ణాల వారికి ఎలాంటి ఈర్ష్య లేకుండా సేవ చేయడమే శూద్రునికి భగవంతుడు నిర్ణయించిన ఏకైక కర్తవ్యం - మనుస్మృతి 1-91)*

వేద కాలంలో ఒక వ్యక్తి తన గుణకర్మల ఆధారంగా మారే అవకాశం ఉన్న వృత్తిని, మనుధర్మ శాస్త్రం పూర్తిగా **జన్మతః** ముద్ర వేసింది. ముఖం నుండి పుట్టినవాడు బ్రాహ్మణుడిగా, పాదాల నుండి పుట్టినవాడు శూద్రుడిగా జీవితాంతం అదే కులంలో కురుచగా బతకాలనే నిబంధనను తెచ్చింది. శరీరంలో ముఖం ఉన్నత స్థానంలో ఉంటుంది కాబట్టి బ్రాహ్మణుడు అందరికంటే శ్రేష్ఠుడని, పాదాలు కింది భాగంలో ఉంటాయి కాబట్టి శూద్రుడు అంటుకోరానివాడని, వేదాలు చదివితే కఠిన శిక్షలు అర్హులని మనుస్మృతి శాసించింది. ఉదాహరణకు, శూద్రులు వేద మంత్రాలు వింటే వారి చెవులలో సీసం పోయాలనే క్రూరమైన నిబంధనలను ప్రచారం చేయడానికి ఈ వక్రీకృత శ్లోక తాత్పర్యాలే పునాది అయ్యాయి. ఈ విధంగా, వేదాల్లోని ఒక అందమైన 'సమైక్యతా తత్త్వాన్ని' మనుధర్మ శాస్త్రం వంటి గ్రంథాలు రాజకీయ , పితృస్వామ్య ఆధిపత్యం కోసం విడదీసి, సమాజంలో అణచివేతకు, కుల వ్యవస్థకు ఒక బలంగా మార్చేశాయి.

భగవద్గీతలో కూడా చాతుర్వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఉంది. అయితే, ఇది పురుష సూక్తంలో చెప్పిన 'శరీర అంగాల' వర్ణనకన్నా, వ్యక్తి యొక్క **గుణ-కర్మల** ఆధారంగా చేసిన విభజనగా శ్రీకృష్ణుడు స్పష్టంగా పేర్కొన్నాడు. గీతలోని ఈ శ్లోకం చాలా ముఖ్యమైనది.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః |
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ||

(నాలుగు వర్ణాలు నాచేతనే సృష్టించబడ్డాయి, అయితే అది వారి వారి గుణాలూ, కర్మల విభజనను బట్టి మాత్రమే. భగవద్గీత ఈ వ్యవస్థను జన్మ ఆధారితంగా కాకుండా, **వృత్తిపరమైన , స్వభావ సిద్ధమైన విభజనగా** సమర్థించినట్లు కనిపిస్తుంది. కానీ, వాస్తవంలో ఇది ఆచరణలో సాధ్యమేనా? కాదని స్పష్టంగా అర్థమవుతుంది. ఆధునిక సమాజం పురుష సూక్తంలోని 'శరీర అంగాల' ప్రతీకను , గీతలోని 'గుణ-కర్మల' సిద్ధాంతాన్ని అర్థం చేసుకునేటప్పుడు, అవి **"పరస్పర అనుబంధం"** గురించి మాట్లాడుతున్నాయని గ్రహించాలి. వ్యవస్థలో ప్రతి ఒక్కరి పాత్ర సమానమే అని, ఏ ఒక్క వర్గం మరొక వర్గం కంటే ఎక్కువ లేదా తక్కువ కాదని అర్థం చేసుకోవడమే ఈ శ్లోకాల అసలైన వైజ్ఞానిక, సామాజిక సమన్వయం. మనుధర్మ శాస్త్రం పెట్టిన జన్మ ఆధారిత కుల ముద్ర, వేదాల , గీత యొక్క అసలు ఉద్దేశ్యానికి పూర్తిగా విరుద్ధమైనదని కూడా మనం గ్రహించాలి.



డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్, ఫోన్: 9989628049

సాహిత్య లహరి
SAHITYA LAHARI
ఆదివారం 16-08-2026

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# బతుకు చిత్రాల...
# తెలంగాణ కథ

**తెలంగాణ రాష్ట్రావతరణానంతర కథా సాహిత్యం తెలంగాణ నేల ఆత్మగౌరవాన్ని, మారుతున్న సామాజిక-ఆర్థిక జీవన చిత్రాలను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరిస్తుంది. జ్వలిత దెంచనాల, డాక్టర్ ఎం. దేవేంద్ర సంపాదకత్వంలో వెలువడిన 'తెలంగాణ కథ 2022-2023' వంటి సంకలనాలు దీనికి నిలువెత్తు రూపాలు. ఈ కాలపు కథలు విభిన్న వస్తువైవిధ్యాన్ని స్పృశించాయి. ఉదాహరణకు, బతుకమ్మ పండుగ నేపథ్యంలో అత్త ఆధిపత్యాన్ని, భర్త తీరును ఎదిరించి తన ఆత్మగౌరవమే ముఖ్యమని నిరూపించుకున్న కమల ధైర్యాన్ని తెలిపే డా. నందిని సిధారెడ్డి 'కుంజీ' కథ; సాయుధ పోరాట ఆదర్శాలను, అనాథల ఎదుగుదలను గుర్తుచేసుకుంటూ అంతరాత్మతో మథనపడే పోలీసు అధికారి కథను చెప్పే శీలం భద్రయ్య 'అద్దం' కథ; అలాగే ఆచారాల ముసుగులో నెలసరి మైలను, శతాబ్దాల అంటరానితనాన్ని కోమల, నీరజల ద్వారా నిలదీస్తూ సామాజిక చైతన్యాన్ని రగిలించిన జూపాక సుభద్ర 'అంటు - ముట్టు' వంటి ఎన్నో మేలిమి కథలు వర్తమాన తెలంగాణ సమాజపు అంతరంగాలను, జీవన పోరాటాలను కళ్లకు కట్టాయి. ఈ అంశాలను తెలంగాణ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన తెలంగాణ కథ ఆధారంగా ఈ వ్యాసంలో విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.**

"తెలంగాణ రాష్ట్రావతరణానంతర కథా సాహిత్యంపై ప్రముఖ విమర్శకులు, సంపాదకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇక్కడి సాహిత్య వైవిధ్యాన్ని బలంగా చాటుతున్నాయి. మారిన భూ స్వరూపం, రియల్ ఎస్టేట్ ప్రభావంతో రైతుల కష్టాలు, ఆధునిక యంత్రాల రాకతో కులవృత్తులు ఎదుర్కొంటున్న వేదనలు వంటి సమకాలీన సామాజిక-ఆర్థిక మార్పులను నిశితంగా రికార్డు చేసిన గ్రంథాలు వర్తమాన తెలంగాణ నడకను తెలుసుకోవడానికి ప్రామాణిక అద్దాలుగా నిలుస్తాయని విమర్శకులు ఆడెపు లక్ష్మీపతి కొనియాడారు. అలాగే, గత పదేళ్లుగా తెలంగాణ సోయి, సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబించేలా సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్ వంటి సంపాదకులు 'రంది', 'తన్లాట', 'అలుగు', 'కూరాడు', 'దావత్' వంటి వార్షిక కథా సంకలనా లను వెలువరిస్తూ వచ్చారు; మూడు తరాల తెలంగాణ కథలను, స్త్రీల అనుభవాలను వెలుగులోకి తెస్తూ, ఇక్కడి మట్టి వాసనలను మరియు అస్తిత్వ పోరాటాలను భావితరాలకు అందించడంలో వీరిద్దరి కృషి సాహిత్య రంగంలో విశేషమైనదిగా నిలుస్తోందని సాహిత్య లోకం భావిస్తోంది. మనిషి పరిణామ క్రమంలో కథకు గల ప్రాధాన్యత ఎంతో విశిష్టమైనది. రాతియుగంలో సైగలతో మొదలై, సంఘజీవనంతో రూపుదిద్దుకున్న భాష ద్వారా కథ ఆవిర్భవించింది. నోటి మాటగా ప్రచారమైన కథలు, అక్షర రూపం సంతరించుకుని ముద్రణారంగం రాకతో ప్రజలందరికీ చేరువయ్యాయి. తెలుగులో ఆధునిక కథ పుట్టి నూరేళ్లు దాటగా, పత్రికలు మరియు పుస్తకాల ద్వారా లక్షకు పైగా కథలు వచ్చాయి. నీతి, ధర్మం, సాహసం వంటి అంశాలతో సాగే ఈ కథలకు నేటికీ అత్యంత ఆదరణ లభిస్తోంది."






తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి

తెలంగాణ సమాజం, భాష, సాంస్కృతిక జీవన శైలి వెనుక శతాబ్దాల చారిత్రక, నైసర్గిక పరిణామాలు ఉన్నాయి. దక్కన్ పీఠభూమి వైవిధ్యం, నిజాం నిరంకుశ పాలన, ఫ్యూడల్ వ్యవస్థల నడుమ నలిగిన ఈ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో భాషా-సాహిత్యాల పరంగా తీవ్ర వివక్షను ఎదుర్కొంది. సీమాంధ్ర ఆధిపత్య పత్రికలు తెలంగాణ యాసను, మాండలికాన్ని చిన్నచూపు చూసినప్పటికీ, ఇక్కడి రచయితలు 'రియలిస్ట్ పెయింటింగ్' లాంటి సహజత్వంతో జీవన సంఘర్షణలను ఉన్నది ఉన్నట్లుగా అక్షరీకరిస్తూ ఆణిముత్యాల వంటి సాహిత్యాన్ని సృష్టించారు. 2017లో తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడిన తర్వాత, 100 సంవత్సరాల కథా చరిత్రతో "అస్తిత్వ" సంకలనాన్ని తెచ్చి ఈ చారిత్రక పరిణామాలను పాఠకులకు అందించింది. స్వయం పాలనలో లభించిన సాహితీ స్వేచ్ఛతో, తొలి-మలి తరాల ఫ్యూడల్ వ్యతిరేక, వామపక్ష పోరాటాల నుంచి నేటి ప్రపంచీకరణ వరకు తెలంగాణ కథ నిరంతరం నూతన సరిహద్దులను స్పృశిస్తోంది. ఆ క్రమంలోనే జ్వలిత దెంచనాల, డాక్టర్ ఎం. దేవేంద్ర సంపాదకత్వంలో 2022-2023 సంవత్సరాలలో ప్రచురితమైన ఉత్తమ కథలను ఎంపిక చేసి "తెలంగాణ కథ 2022-2023" పేరుతో అకాడమీ మరొక విశిష్ట సంకలనాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత 30 సంవత్సరాలుగా అనేక కథల సంకలనాలు వస్తున్నప్పటికీ, వాటిలో తెలంగాణ కథలకు నామమాత్రపు స్థానమే దక్కింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కరీంనగర్, ఖమ్మం, నల్గొండ వంటి జిల్లాల వారీగా ప్రత్యేక కథల సంకలనాలు వెలువడ్డాయి. అలాగే సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో గత పదేళ్లుగా తెలంగాణ కథా సంకలనాలు వస్తున్నప్పటికీ, అవి పరిమిత సంఖ్యలోనే వచ్చాయి. 'మూడు తరాల తెలంగాణ కథ', 'తెలం గాణ స్త్రీల కథలు' వంటి సంకలనాలు కొంత ఊరట నిచ్చినప్పటికీ, తెలంగాణ కథకు దక్కాల్సినంత గుర్తింపు రాలే దన్నది అక్షర సత్యమని సంపాదకులు దళిత దెంచనాల, డాక్టర్ ఎం.దేవేంద్ర తమ మున్నుడిలో తెలిపారు.

"ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత కవులు, రచయితలు తీవ్ర వివక్ష నెదుర్కొన్నారు. సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యంలో నడిచే పత్రికలూ, ప్రచురణ సంస్థలూ తెలంగాణ తెలుగుని, పలుకుబడులను, యాసను చిన్నచూపు చూశాయి. రాయలసీమ, కోస్తాజిల్లాల మాండలికాన్ని నెత్తిన పెట్టుకున్నాయి కానీ తెలంగాణ మాండలికాన్ని, నుడులను, నుడికారాన్ని వినసొంపుగా వుండవన్న నెపంతో, ప్రిజుడిస్ తో తిరస్కరించాయి. గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల భాషే ప్రచార, ప్రసార మాధ్యమాల్లో, పాఠ్యపుస్తకాల్లో ప్రవేశపెట్టబడి ప్రామాణికభాషగా చెలామణి అయింది. పలు వేదికలు, శాఖలు, సాహితీ సంస్థలు ప్రచురించే సంకలనాల్లో తెలంగాణ కథకులకు తగు ప్రాతినిధ్యమివ్వలేదు."
(ఆడెపు లక్ష్మీపతి, తెలంగాణ కథ 2022-2023, పుటః 5)

ఈ లోటును పూడుస్తూ వివిధ పత్రికలలో వచ్చిన 60 కథలను ఎంపిక చేసి, ఈ పుస్తకం ద్వారా వారు మన ముందుకు తీసుకువచ్చారు.

మారిన భూ స్వరూపం, రియల్ ఎస్టేట్ ప్రభావంతో రైతుల కష్టాలు, ఆధునిక యంత్రాల రాకతో కులవృత్తులు ఎదుర్కొంటున్న వేదనలు వంటి సమకాలీన సామాజిక-ఆర్థిక మార్పులను నిశితంగా రికార్డు చేసిన ఈ పుస్తకం వర్తమాన తెలంగాణ నడకను తెలుసుకోవడానికి ఒక ప్రామాణిక అద్దంగా నిలుస్తుందని ప్రముఖ విమర్శకులు ఆడెపు లక్ష్మీపతి పుస్తక ముందుమాటలో కొనియాడారు. అలాగే, గత పదేళ్లుగా తెలంగాణ సోయి, సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబించేలా సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్ వంటి సంపాదకులు 'రంది', 'తన్లాట', 'అలుగు', 'కూరాడు', 'దావత్' వంటి వార్షిక కథా సంకలనాలను వెలువరిస్తూ వచ్చారు. మూడు తరాల తెలంగాణ కథలను, స్త్రీల అనుభవాలను వెలుగులోకి తెస్తూ, ఇక్కడి మట్టి వాసనలను, అస్తిత్వ పోరాటాలను భావితరాలకు అందించడంలో వీరిద్దరి కృషి సాహిత్య రంగంలో విశేషమైనదిగా నిలుస్తోందని సాహిత్యలోకం భావిస్తోంది.

ఈ సంకలనంలోని కొన్ని కథలను పరిశీలిస్తే, వర్తమాన సమాజంలోని విభిన్న జీవన పోరాటాలను, మానసిక మథనాలను, సంస్కృతిని, స్త్రీల ఆత్మగౌరవాన్ని అత్యంత సజీవంగా, శక్తివంతంగా ఆవిష్కరించాయి. డా. నందిని సిధారెడ్డి రచించిన **'కుంజీ'** కథ బతుకమ్మ పండుగ పూల వేట నేపథ్యంలో ప్రారంభమై, అత్త ఆధిపత్యం మరియు సొంత ఆలోచన లేక ప్రతి విషయానికీ **"అమ్మ ఎట్లంటే గట్ల"** అని తప్పించుకునే భర్త ఆంజనేయులు ప్రవర్తన వల్ల కమల పడే వేదనను చూపుతుంది; చివరకు పంచాయితీలో ఎంతమంది చెప్పినా మారని భర్తతో కాపురం వద్దని, తన ఆత్మగౌరవమే ముఖ్యమని కమల ధైర్యంగా నిర్ణయం తీసుకోవడాన్ని కథ ప్రతిబింబిస్తుంది. శీలం భద్రయ్య రచించిన **'అద్దం'** కథ ఒక పోలీసు అధికారి తన పదవీ విరమణ రోజున గతాన్ని నెమరువేసుకుంటూ, సాయుధ పోరాటంలో అమరుడైన తండ్రి ఆదర్శాలను, తను ఆదుకున్న రవి అనే అనాథ బాలుడి ఎదుగుదలను తలచుకుంటూ, అద్దాన్ని రూపకంగా పెట్టుకుని తన అంతరాత్మతోను, సమాజంలోని వ్యవస్థాగత లోపాలతోను చేసుకునే లోతైన ఆత్మ పరిశీలనను కళ్లకు కడుతుంది. ఆచార్య సూర్యాధనంజయ్ రచించిన **'లడాయి'** కథ భర్త తాగుడుకు బానిసై హఠాత్తుగా చనిపోవడంతో ముగ్గురు ఆడపిల్లలతో అనాథగా మిగిలిన కేస్లీ అనే బంజారా మహిళ, జీవితంలో ఎదురయ్యే కష్టాలకు వెరవకుండా, **"బతుకంటే ఒక జంగ్"** అనే తండ్రి మాటలను స్ఫూర్తిగా తీసుకుని, తప్పిపోయిన 'సీతి' అనే మేక తిరిగిరావడంతో పొందిన ఆశతో తన పిల్లల భవిష్యత్తు కోసం సాగించిన వీరోచిత జీవన పోరాటాన్ని ఆర్ద్రంగా ఆవిష్కరిస్తుంది. నాంపల్లి సుజాత రచించిన **'ఎదురీత'** కథ ఒకవైపు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధితో శారీరక వేదన అనుభవిస్తూనే, మరోవైపు కష్టకాలంలో భర్త చేసిన నమ్మకద్రోహాన్ని, వేధింపులను తట్టుకుని, ధైర్యంగా విడాకులు పొంది తన ఉద్యోగం మరియు బడి పిల్లల ప్రేమే ఆసరాగా నిలబడిన సంధ్యా మేడమ్ యొక్క అసమాన ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తుంది. జూపాక సుభద్ర రచించిన **'అంటు - ముట్టు'** కథ ఆచారాల ముసుగులో నెలకు నాలుగు రోజులు స్త్రీలను మూలకు నెట్టే నెలసరి మైల అనే 'అంటు'ను, శతాబ్దాలుగా సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న 'ముట్టు' అనే సామాజిక అంటరానితనాన్ని కోమల, నీరజల పాత్రల ద్వారా నిలదీస్తూ, సమాజంలోని మూఢనమ్మకాలను దాటుకుని భావి తరాలు స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించాలనే బహుజన సామాజిక చైతన్యాన్ని రగిలిస్తుంది.

'తెలంగాణ కథలు 2022-2023' సంకలనం వర్తమాన తెలంగాణ జన జీవితాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరించిన విభిన్న వస్తు వైవిధ్యం కలిగిన కథా సమాహారం. ఈ సంకలనంలో గౌండ్ల కులవృత్తికి సంబంధించిన 'బల్దా', 'నీరాజనం' కథలు ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న కులవృత్తుల గురించి ఆలోచింపజేస్తే; డ్యాముల నిర్మాణం వల్ల జరిగే విధ్వంసాన్ని, ముంపు ప్రాంత ప్రజల ఇక్కట్లను బడి పంతులు కోణంలో 'నిలువెత్తు దుఃఖం' కథ ఆర్ద్రంగా వివరించింది. బడా కాంట్రాక్టర్ల చేతిలో ఉద్యమకారుని హత్యను తెలిపే 'మట్టి దిబ్బ', నల్లమల యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటాన్ని చిత్రించిన 'పిడికిలి' కథలు క్షేత్రస్థాయి పరిశీలనకు నిదర్శనంగా నిలవగా, వీటిని అందించిన సిద్దెంకి యాదగిరి, కొండి మల్లారెడ్డి, యాకమ్మలు అభినందనీయులు. ముస్లిముల జీవిత కోణాలను, కొత్త చట్టాల నేపథ్యంలో వారి అభద్రతా భావాన్ని 'హిందూ సితారా హమారా', 'విజన్ 2020 ఏ లవ్ స్టోరీ' కథలు చక్కగా పట్టుకున్నాయి. అలాగే చెంచులు, లంబాడీల జీవితాలను 'మాల్', 'ఉండాలీర్ పాణి' కథలు తెలియజేయగా, అనాథ విజయగాథగా 'పోరి' (జ్వలిత), తల్లి త్యాగాన్ని చాటే 'అమ్మత్యాగం' (మారోజు దేవేంద్ర), ఐటీ ఉద్యోగిని కులవివక్ష పోరాటంగా 'తెరీడిన పువ్వెండ' (గోగు శ్యామల) కథలు రచయిత్రుల పరిశీలనా పటిమకు అద్దం పడతాయి.

శ్రమైకజీవన సౌందర్యాన్ని ఆవిష్కరించిన 'పచ్చి ఎచ్చాల డబ్బా..' (జాజుల గౌరీ), 'నాయినమ్మతో సినిమా' (జూకంటి జగన్నాథం), 'సెర్చ్ లైట్' (నలిమెల భాస్కర్) కథలతో పాటు ప్రసిద్ధ రచయితలైన బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య, కె.వి. నరేందర్, పెద్దింటి అశోక్ కుమార్, అయోధ్యారెడ్డి, అఫ్సర్, జింలో, పోల్కంపల్లి శాంతాదేవి తదితరుల కథలు విశేషంగా ఆకట్టుకుంటాయి. ఫ్యూడలిస్ట్ భావాలను ఎండగట్టిన 'మత్తయ్య చదువు', ప్రయోగవాదాన్ని ప్రదర్శించిన 'కలలు రాలుతున్న నేల', మధ్యమ పురుష దృష్టికోణంలో సాగిన 'రకూన్' కథలు కథన రీతుల్లో కొత్తదనాన్ని చూపించాయి. పిల్లల సైకాలజీని స్పృశించిన 'సూసైడ్ నోట్', 'మొక్కు' కథలతో పాటు సెల్ ఫోన్ దుష్ప్రభావాన్ని ఎండగట్టిన 'ఎర్రజీరలు', 'ఫస్ట్ ట్రిప్ విత్' కథలు తీవ్రంగా ఆలోచింపజేస్తాయి. ముఖ్యంగా ఈ సంకలనంలోని నాలుగు ప్రత్యేక కథల్లో నస్రీన్ ఖాన్ 'ధూప్ ఛావ్' ఒక ముస్లిం వనిత జీవిత ఆటుపోట్లను, మత ఛాందసత్వం వల్ల ఆడపిల్లలు ఎదుర్కొనే అణచివేతను ఆర్ద్రంగా చిత్రించి ఆశావాదాన్ని ప్రబోధిస్తే; సలీమ 'చేయూత' కథ మత కట్టుబాట్లను ఎదిరించి తనను ప్రేమించిన వ్యక్తితో నూతన జీవితానికి సిద్ధపడే ముస్లిం యువతి ఆలోచనలకు అద్దం పడుతుంది. గీతాంజలి 'ఆమె.. ఒక డిస్ఫోరియా' కథ ట్రాన్స్ వుమన్ వేదనాభరిత జీవితాన్ని, సమాజంలో మార్పు రావాల్సిన అవసరాన్ని స్పృశిస్తే; వి. శాంతి ప్రబోధ 'టచ్' కథ విప్లవాదర్శాల కోసం అజ్ఞాత జీవితం గడిపి తిరిగొచ్చాక, కన్న కొడుకు దృష్టిలో స్వార్థజీవిగా మిగిలిపోయిన ఒక తల్లి అంతర్మథనాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది.

"రచయితల స్వేచ్ఛా విహంగాలు విరిగిపోయిన కాలం ఇది. భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వాతంత్ర్యం ప్రశ్నార్థకమైన సందర్భమిది. అందుకే ఇప్పుడు కథా సృజన అంత సులభమైన ప్రక్రియ కాదు. కాలక్షేపం అసలే కాదు. కాలక్షేపపు కథలు కూడా రావడం లేదని కాదు. మొదటి నుండి తెలంగాణ కథకొక జీవలక్షణం ఉంది. వస్తువు, భాష, శిల్పం విషయంలో తెలంగాణ కథల పోకడ మిగతా తెలుగు కథలకన్నా భిన్నంగా ఉంటూ వస్తోంది. కాలం ఎలాంటి మార్పులకు గురవుతూంటే అలాంటి మార్పులను పట్టుకొని, వాటిని జీవధాతువుగా చేసుకొని సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలకు అనుగుణంగా స్పందిస్తూ రావడాన్ని స్వభావంగా చేసుకొని ముందుకు సాగుతోంది. తొలినాళ్ల నుంచి కూడా తెలంగాణ కథా రచయితలు తమ కథల ద్వారా వర్తమాన సాంఘిక చరిత్రను లిఖించుకుంటూ వస్తున్నారు."
(సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండ శ్రీధర్, రూబిడి తెలంగాణ కథ-2019, పుటః 11)



జ్వలిత దెంచనాల



డా. ఎం. దేవేంద్ర

తెలంగాణ కథకులు వర్తమాన సామాజిక వాస్తవికతను అత్యంత సంవేదనా త్మకంగా చిత్రించిన ఈ మేలిమి కథా సంకలనాన్ని ఎంతో శ్రమకోర్చి తీర్చిదిద్దిన సంపాదకులు జ్వలిత, దేవేంద్ర గార్లకు అభినందనలు... ఈ గ్రంథాన్ని ప్రచురించిన తెలంగాణ సాహిత్య అకాడమీకి, కార్యదర్శి డా. ఎన్. బాలాచారి గారికి శుభాకాంక్షలు. మొత్తంగా చూస్తే, 'తెలంగాణ కథలు 2022-2023' సంకలనం మన సమాజంలోని వివిధ రకాల మనుషుల జీవితాలను, వారి కష్టసుఖాలను చాలా స్పష్టంగా మన కళ్లకు కట్టింది. పాత, కొత్త రచయితలు కలిసి రాసిన ఈ కథలు తెలంగాణ నేల రూపురేఖలను, ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని మరియు మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను నిజాయితీగా రికార్డు చేశాయి. సామాజిక అణచివేత, కులవృత్తుల వేదన, స్త్రీల హక్కులు మరియు ఆధునిక జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ప్రశ్నించిన ఈ పుస్తకం ఒక గొప్ప సాహితీ కృషి. నిత్యం సమాజం కోసం ఆలోచించే ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా పరిశోధకులు, సాహిత్య ప్రేమికులు తప్పక చదవాల్సిన పుస్తకమిది.



సాహిత్య లహరి
SAHITYA LAHARI
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 16-08-2026

సాహిత్య రచనలకు ఆహ్వానం
ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.
sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## 'ముండరాలు' కథలో స్త్రీ అస్తిత్వం

# ఆత్మగౌరవ పోరాటం

**'ముండరాలు' కథ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ రచించిన 'మోకు (గౌడుల కథలు)' కథా సంకలనంలోని ముఖ్యమైన కథల్లో ఒకటి. కులవృత్తి, స్త్రీ అస్తిత్వం, వితంతు జీవితం, పితృస్వామ్యం, శీలనింద, ఆర్థిక స్వావలంబన, విద్య, సామాజిక గౌరవం, ఆధునికత వంటి అనేక సామాజిక అంశాలను ఒకే కథా వస్తువులోకి తీసుకువచ్చిన సామాజిక వాస్తవికతను ఈ కథ చూపిస్తుంది.**

'మోకు' కథా సంకలనానికి డా. అట్టెం దత్తయ్య రాసిన సంపాదకీయంలో "ఎల్లవ్వ ఆర్థికంగా స్వతంత్రురాలైతే కూడా సామాజికంగా అందరిలా కలుపుకుపోలేదు, కానీ ఆమె కొడుకు చదువుతో ఎదిగినపుడు అదే సమాజం ఆమెను మళ్లీ అంగీకరిస్తుంది. దీనిని బట్టి గౌరవం అనేది వ్యక్తి శ్రమకన్నా సామాజిక స్థాయికి కట్టుబడి ఉందని కథ సూచిస్తుంది. చివరికి విద్యావంతురాలైన కోడలు కూడా 'ముండ' అనే ముద్రతోనే ఆమెను అవమానించడం ద్వారా ఆధునికత కూడా పాత పితృస్వామ్యాన్ని మోస్తూనే ఉందని కూడా గుర్తించవచ్చు. ఈ కథ ఆత్మగౌరవ పోరాటం, కులవృత్తిపై హక్కు విధవత్వం పేరుతో జరిగే సామాజిక దహనంపై ధిక్కార గర్జనగా నిలుస్తుందరి అన్నారు.

తెలంగాణ గ్రామీణ సమాజంలో వృత్తులు కేవలం జీవనోపాధి సాధనాలు మాత్రమే కాదు. అవి ఒక సమాజపు ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి, సంబంధాలు, ఆచారాలు, గౌరవం, సామాజిక స్థానం వంటి అంశాలతో ముడిపడి ఉంటాయి. గౌడ సమాజానికి తాటిచెట్లు ఎక్కడం, ఈతచెట్లు గీయడం, కల్లు సేకరించడం, విక్రయించడం వంటి వృత్తులు తరతరాలుగా జీవనాధారంగా ఉన్నాయి. 'ముండరాలు' కథ ఈ వృత్తి నేపథ్యాన్ని ఒక కుటుంబం ద్వారా చూపిస్తుంది. భూదవ్వకు ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు నర్సయ్య తాటిచెట్లు, ఈతచెట్లు ఎక్కడం నేర్చుకొని గీత వృత్తిలో జీవనం సాగిస్తాడు. కానీ తాటిచెట్టు మీద నుంచి పడిపోయి మరణిస్తాడు. అప్పటికే భార్య ఎల్లవ్వకు చిన్నపిల్లాడు. భర్త మరణంతో ఆమె జీవితం ఒక్కసారిగా అంధకారంలో పడుతుంది. ఇక్కడి నుంచే కథ అసలు ప్రారంభమవుతుంది.

నర్సయ్య మరణంతో ఎల్లవ్వ జీవితం పూర్తిగా మారిపోతుంది. ఒకవైపు చిన్న కొడుకు నరేందర్ బాధ్యత, మరోవైపు జీవనోపాధి కోసం పోరాటం. భర్త ఉన్నప్పుడు కుటుంబానికి ఆధారంగా ఉన్న కులవృత్తి, అతడు లేని తర్వాత ఎల్లవ్వకు కొత్త సవాలుగా మారుతుంది. ఆమె ముందు రెండు మార్గాలున్నాయి. ఎవరి దయ మీదో ఆధారపడటం; లేదా తన కాళ్లపై తాను నిలబడటం. ఎల్లవ్వ రెండో మార్గాన్ని ఎంచుకుంటుంది.

గౌడ పెద్దలు తాటిచెట్లు, ఈతచెట్లను పంచినప్పుడు ఎల్లవ్వ కూడా తన వాటాను తీసుకుంటుంది. మొదట ఆమెకు ఆ వృత్తిలో అనుభవం లేదు. కానీ పరిస్థితులు ఆమెను నేర్పిస్తాయి. ఇతరులు ముందుకు రాకపోవడంతో ఆమె స్వయంగా ఈతచెట్లు గీయడం నేర్చుకుంటుంది. తరువాత తాటిచెట్లు ఎక్కడం, పోద్దాళ్లు, పరుపుదాళ్లు, పండుతాళ్లు గీయడం వంటి పనులను నేర్చుకుంటుంది. ఇక్కడ ఎల్లవ్వ కేవలం వితంతువుగా మిగిలిపోదు. వృత్తి నేర్చుకున్న శ్రామికురాలిగా, ఆర్థికంగా స్వతంత్రురాలిగా ఎదుగుతుంది.

ఈ కథలో అత్యంత ముఖ్యమైన అంశం 'ముండరాలు' అనే శీర్షిక. సమాజంలో భర్తను కోల్పోయిన స్త్రీని 'ముండ' అనే పదంతో పిలవడం ద్వారా ఆమె వ్యక్తిత్వాన్ని భర్త ఉనికితో మాత్రమే కొలుస్తారు. ఆమెకు భర్త లేనందుకు ఆమెను అపవిత్రురాలిగా, అశుభకరురాలిగా, అసంపూర్ణురాలిగా చూడటం పితృస్వామ్య సమాజపు దురాచారం. కథలో రాజవ్వను ఉద్దేశించి "**నువ్వు ముండవేనయితివి**" అనే మాట పలకడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. దాని వెనుక ఒక స్త్రీకి సమాజం కేటాయించిన హీనమైన స్థానం ఉంది. అదే ముద్ర చివరకు ఎల్లవ్వ జీవితాన్ని కూడా వెంటాడుతుంది. కాబట్టి 'ముండరాలు' అనే శీర్షిక వితంతుత్వాన్ని ఒక వ్యక్తిగత విషాదంగా కాకుండా, సామాజిక నిర్మాణంగా ప్రశ్నించే శీర్షికగా నిలుస్తుంది.

ఆమె భర్త చనిపోయిన తర్వాత ఎవరి ముందు చేయి చాచదు. కల్లు సేకరిస్తుంది. బుంగలు, బింకులు మోసుకొని ఊరంతా తిరుగుతుంది. ఇంటింటికీ వెళ్లి కల్లు అమ్ముతుంది. అంటే వితంతుత్వం ఆమెను బలహీనురాలిగా చేయలేదు; శ్రమ ఆమెను మరింత బలమైన వ్యక్తిగా చేసింది. ఎల్లవ్వ జీవితంలో కులవృత్తి ఒకవైపు శ్రమతో కూడిన జీవనాధారం. మరోవైపు అదే వృత్తి ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తుంది. ఇక్కడ రచయిత ఒక ముఖ్యమైన ప్రశ్నను ముందుకు తెస్తాడు. స్త్రీ తన శ్రమతో జీవిస్తే ఆమెను గౌరవించడానికి సమాజం ఎందుకు సిద్ధంగా ఉండదు?

కులవృత్తి జీవనాధారమే కాదు, సామాజిక అస్తిత్వం 'ముండరాలు' కథను గౌడ సమాజపు కులవృత్తి నేపథ్యంలో చదవాలి. తాటి చెట్టు, ఈతచెట్టు, కల్లు ఇవి కథలో కేవలం వస్తువులు కావు. అవి గౌడ సమాజపు చరిత్రకు, జీవనానికి, ఆర్థిక వ్యవస్థకు, సంస్కృతికి ప్రతీకలు. ఎల్లవ్వ తాటిచెట్టు ఎక్కడం నేర్చుకునే ఘట్టం ప్రత్యేకమైనది. మొదట పురుషులు చేసే వృత్తిగా కనిపించే పనిని ఆమె స్వీకరిస్తుంది. దాంతో ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవుతుంది. అందువల్ల కథలో కులవృత్తి పట్ల గౌరవం ఒక ప్రధాన భావనగా కనిపిస్తుంది. వృత్తి చిన్నది కాదు. వృత్తిని చేసేవారిని చిన్నచూపు చూడటం తప్పు. కష్టపడి పనిచేసే చేతులకు గౌరవం రావాలనే భావన కథ అంతటా అంతర్లీనంగా ఉంటుంది.

**శ్రమజీవి స్త్రీపై సమాజపు శీలనింద:**

ఎల్లవ్వ ఆర్థికంగా స్వతంత్రురాలైన కొద్దీ ఆమె సమస్యలు తగ్గవు. కొత్త సమస్య మొదలవుతుంది. శీలనింద. ఆమె ఒంటరి స్త్రీ. భర్త లేదు. తాటిచెట్లు ఎక్కుతుంది. ఇంటింటికీ తిరుగుతుంది. పురుషులతో మాట్లాడాల్సి వస్తుంది. కల్లు అమ్ముతుంది. ఇవన్నీ పితృస్వామ్య సమాజానికి ఆమెపై అనుమానం పెంచడానికి కారణాలవుతాయికథలోని సామెతలు, మాటలు, చూపులు అన్నీ స్త్రీని నియంత్రించే సామాజిక ఆయుధాలుగా మారతాయి.

"ముండ" అనే పదం, "ముండబొడ్డి" అనే అవమానకర సంబోధన, ఆమె నడకపై, మాటపై, వృత్తిపై చేసే అనుమానాలు ఇవన్నీ కలిసి స్త్రీ స్వేచ్ఛను నియంత్రించే పితృస్వామ్య వ్యవస్థను బయటపెడతాయి. ఎల్లవ్వ ఎవరినీ ఆశ్రయించకుండా తన వృత్తి తాను చేసుకుంటున్నప్పటికీ సమాజం ఆమె శీలాన్ని ప్రశ్నిస్తుంది. ఇక్కడ కథ ఒక కీలకమైన సత్యాన్ని చెబుతుంది. స్త్రీ ఆర్థికంగా స్వతంత్రురాలైనంత మాత్రాన సామాజికంగా స్వతంత్రురాలు కాలేదు.

'రాజవ్వ సంఘటన స్త్రీలందరి ఉమ్మడి విషాదం. కథలో రాజవ్వకు సంబంధించిన పంచాయితీ ఘట్టం చాలా ప్రాధాన్యమైనది. రాజవ్వను ఆమె భర్త వేధిస్తాడు. ఆమె తన భర్తను సరిగ్గా చూసుకోలేదని, ఇతర పురుషులతో సంబంధం ఉందని నిందలు వేస్తాడు. పంచాయితీలో ఆమెను 'ముండ' అనే పదంతో అవమానిస్తారు. చివరికి రాజవ్వ తనపై వచ్చిన నిందలను తట్టుకోలేక కన్నీళ్లతో తన బాధను వ్యక్తం చేస్తుంది. ఈ సంఘటనను ఎల్లవ్వ చూస్తుంది. రాజవ్వ బాధలో ఎల్లవ్వ తన భవిష్యత్తును, తన గతాన్ని, తనలాంటి స్త్రీల జీవితాన్ని చూసుకుంటుంది. అందుకే రాజవ్వ కథ ఎల్లవ్వ కథకు ఉపకథ కాదు. అది స్త్రీల ఉమ్మడి అస్తిత్వ వేదనకు ప్రతీక.

కథలోని పంచాయితీ ద్వారా రచయిత గ్రామీణ పితృస్వామ్య న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తాడు. పురుషుడు రాత్రిళ్లు ఎక్కడికి వెళ్లినా సమాజం పెద్దగా ప్రశ్నించదు. కానీ స్త్రీ ఒక పురుషుడితో మాట్లాడినా, ఇంటి బయట కనిపించినా ఆమె శీలాన్ని అనుమానిస్తారు. ఇది లింగ ఆధారిత ద్వంద్వ నైతికత.రాజవ్వ విషయంలోనూ ఇదే జరుగుతుంది. ఆమెపై ఆధారాలు లేని నిందలు వేస్తారు. చివరకు ఆమె విడాకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రచయిత ఇక్కడ స్త్రీని మాత్రమే కాదు; స్త్రీని తీర్పు చెప్పే సామాజిక వ్యవస్థనే విచారణకు నిలబెడతాడు.

ఎల్లవ్వ తన శ్రమతో జీవించడం ప్రారంభించిన తరువాత ఒక ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తుంది. ఆమెకు డబ్బు వస్తుంది.






ఆమె తన కొడుకును చదివిస్తుంది. ఆమె ఎవరి దయ మీద ఆధారపడదు. అయినా సమాజం ఆమెను పూర్తిగా అంగీకరించదు.ఇక్కడ రచయిత చూపించిన అంశం అత్యంత గమనించదగినది. ఆర్థిక స్వావలంబన వచ్చినా, సామాజిక గౌరవం వెంటనే రాదు.

ఎల్లవ్వకు కల్లు కొనడానికి వచ్చే స్త్రీలలో కూడా సామాజిక కపటత్వం కనిపిస్తుంది. కొందరు ఇంట్లో తెలియకుండా కల్లు తాగుతారు. కొందరు పంట దినుసులు ఇచ్చి కల్లు తీసుకుంటారు. అంటే సమాజం బహిరంగంగా తప్పు అని చెప్పే పనిని రహస్యంగా తానే చేస్తుంది. ఇది సామాజిక కపటత్వానికి అద్దం.

ఎల్లవ్వకు తన జీవితంపై పెద్ద ఆశలు లేకపోయినా, తన కొడుకు నరేందర్పై మాత్రం పెద్ద ఆశ ఉంటుంది. ఆమె తన కొడుకును చదివిస్తుంది. నరేందర్ పదో తరగతిలో మంచి మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం కథలో ఒక మలుపు. అతనికి ఉన్నత విద్య అందుతుంది. చివరకు ఉద్యోగం వస్తుంది. ఇక్కడ విద్య సామాజిక చలనశీలతకు సాధనంగా నిలుస్తుంది. ఎల్లవ్వ జీవితంలో తన తరానికి సాధ్యం కానిది తన కొడుకు తరానికి సాధ్యమవుతుంది. ఆమె కల "నా కొడుకు నా లాంటి బతుకు బతకకూడదు" అనే తల్లి ఆకాంక్షగా మారుతుంది.

నరేందర్ ఉద్యోగం పొందిన తరువాత ఎల్లవ్వను అవమానించినవారే ఆమెను గౌరవించడం ప్రారంభిస్తారు. ఇంతకుముందు దూరం పెట్టినవారు, అవమానించినవారు, ఆమెను అనుమానించినవారు, ఇప్పుడు పలకరిస్తారు, కౌగిలించుకుంటారు, ఆమె అదృష్టాన్ని పొగుడుతారు. ఇక్కడ రచయిత సమాజపు విలువలను ప్రశ్నిస్తాడు. ఎల్లవ్వ మారిందా? లేదు. మారింది ఆమె కాదు. ఆమె కొడుకు సామాజిక స్థానం మారింది. అంటే సమాజం శ్రమను గౌరవించలేదు; స్థాయిని గౌరవించింది. ఇది కథలోని అత్యంత బలమైన సామాజిక విమర్శల్లో ఒకటి.

**రమ్య పాత్ర – ఆధునికతపై కథ వేసిన ప్రశ్న :**

కథ చివరి భాగంలో రమ్య ప్రవేశం కథను మరో స్థాయికి తీసుకువెళుతుంది. రమ్య విద్యావంతురాలు. ఉద్యోగం చేస్తుంది. పట్టణంలో జీవిస్తుంది. ఆధునిక ఆలోచనలు కలిగిన యువతిగా కనిపిస్తుంది. కానీ ఆమె ఎల్లవ్వను అవమానించే సందర్భంలో పాత పితృస్వామ్య భాషనే ఉపయోగిస్తుంది. "ముండ మొఖం చూస్తే ఇలాగే ఉంటుంది" వంటి మాటలతో ఎల్లవ్వను బాధిస్తుంది. ఇక్కడ రచయిత చాలా లోతైన ప్రశ్నను లేవనెత్తాడు. విద్యావంతురాలిగా మారడం మాత్రమే ఆధునికతకు ప్రమాణమా? రమ్య చదువుకుంది. ఉద్యోగం చేస్తుంది. పట్టణంలో జీవిస్తుంది. కానీ వితంతువుపై ఉన్న పాత సామాజిక ముద్రను మాత్రం మోస్తుంది. అందువల్ల కథ చెప్పే విషయం ఆధునిక జీవనశైలి మారినా, మనుషుల అంతరంగంలో ఉన్న పితృస్వామ్య భావజాలం మారకపోతే నిజమైన ఆధునికత రాదు.

ఎల్లవ్వ జీవితమంతా తన కొడుకు కోసం పోరాడుతుంది. తన శ్రమతో అతన్ని చదివిస్తుంది. అతను ఉద్యోగం పొందినప్పుడు తన జీవిత పోరాటానికి ఫలితం దొరికిందని భావిస్తుంది. కానీ చివరికి అదే కొడుకు భార్య మాట విని తల్లిని వదిలి పట్టణానికి వెళ్లిపోతాడు. ఇది కథలో అత్యంత విషాదకరమైన మలుపు. ఎల్లవ్వ భర్తను కోల్పోయింది. అత్తను కోల్పోయింది. కులవృత్తి ద్వారా ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. సమాజం చేత నిందించబడింది. కొడుకు కోసం జీవించింది. కొడుకును చదివించింది. అయినా చివరకు కొడుకే ఆమెకు దూరమవుతాడు.ఇది కేవలం ఒక తల్లి విషాదం కాదు. స్త్రీ జీవితానికి సమాజం ఇచ్చే అనిశ్చిత భద్రతకు ప్రతీక.

ఈ కథలో ఎల్లవ్వ ఒక బాధితురాలిగానే ఉండిపోదు. ఆమె వితంతువు, శ్రామికురాలు, గీతకార్మికురాలు, ఆర్థికంగా స్వతంత్రురాలు, తల్లి, కొడుకు విద్య కోసం పోరాడే వ్యక్తి, సామాజిక అవమానాన్ని ఎదుర్కొనే స్త్రీగా పరిణమిస్తుంది. కాబట్టి ఎల్లవ్వ పాత్రను కేవలం 'ముండరాలు'గా చూడటం కథను చిన్నచూపు చూడటమే అవుతుంది. ఆమె ఒక ఆత్మగౌరవం కలిగిన శ్రామిక స్త్రీ. ఆమె తన జీవితాన్ని తానే నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుంది.

'ముండరాలు' కథను ఒకే కోణంలో చదవడం సరిపోదు. ఎల్లవ్వను మూడు స్థాయిలు ప్రభావితం చేస్తున్నాయి. కులం గౌడ కులవృత్తికి చెందిన స్త్రీగా ఆమె వృత్తిపరమైన సామాజిక స్థానంతో గుర్తించబడుతుంది. స్త్రీగా ఆమె శీలం, ప్రవర్తన, నడక, మాటలపై సమాజం నిఘా పెడుతుంది. వైవాహిక స్థితి భర్త చనిపోయిన తరువాత ఆమెపై 'ముండ' అనే సామాజిక ముద్ర పడుతుంది. ఈ మూడు కలిసి ఎల్లవ్వ జీవితాన్ని సంక్లిష్టం చేస్తాయి. అందువల్ల 'ముండరాలు' కథను కుల–లింగ అణచివేతల అంతఃసంబంధాన్ని చూపించే కథగా కూడా విశ్లేషించవచ్చు.

**భాష – తెలంగాణ మాండలిక జీవశక్తి :**

నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ కథలో భాష ప్రత్యేకమైన బలం. కథలో పాత్రలు మాట్లాడే భాష పుస్తక తెలుగు కాదు. అది తెలంగాణ గ్రామీణ జీవన భాష. ఉదాహరణకు

**"ఎట్ల జెయ్యన్నె మరి"**
**"ఎవలనన్న గీసుకొమ్మని చెప్పు"**
**"వాడింకేమత్తడు"**
**"గరీబోల్ల బతుకులు గట్లనే ఉంటాయి"**

వంటి సంభాషణలు కథకు సహజత్వాన్ని అందిస్తాయి. ఈ మాండలికం వల్ల పాత్రలు పుస్తకంలోని కల్పిత పాత్రలుగా కాకుండా మన చుట్టూ కనిపించే మనుషులుగా అనిపిస్తాయి. అలాగే తాటిచెట్లకు సంబంధించిన పదజాలం, కల్లుగీత వృత్తికి సంబంధించిన పదాలు, గ్రామీణ సామెతలు, స్థానిక నుడికారాలు కథకు సాంస్కృతిక ప్రామాణికతను అందిస్తాయి.

ఈ కథలో సామెతలు కేవలం భాషా అలంకారాలు కావు. వాటి వెనుక ఉన్న సామాజిక భావజాలాన్ని రచయిత బయటపెడతాడు. ప్రత్యేకంగా వితంతువులు, స్త్రీలు, వారి శీలం గురించి పుట్టిన సామెతలు స్త్రీని నియంత్రించడానికి ఉపయోగపడతాయి. అందువల్ల కథలోని సామెతలను రెండు రకాలుగా చూడవచ్చు. ఒకటి తెలంగాణ జానపద సంస్కృతికి గుర్తులు. రెండు పితృస్వామ్య సమాజపు విలువలను మోసుకొచ్చే భాషా ఆయుధాలు. ఈ ద్వంద్వ స్వభావాన్ని రచయిత కథలో సమర్థంగా వినియోగించాడు.

'ముండరాలు'లో సంఘటనలు అతిశయోక్తిగా కాకుండా గ్రామీణ జీవితంలో సాధారణంగా జరిగే విధంగా సాగుతాయి. భర్త మరణం, పిల్లల బాధ్యత, కులవృత్తి, చెట్ల కౌలు, పన్నులు, కల్లు విక్రయం, పంచాయితీ, వితంతువుపై నిందలు, విద్య, ఉద్యోగం, కోడలి ఆధిపత్యం ఇవన్నీ కథను సామాజిక పత్రంగా నిలబెడతాయి. అందుకే ఈ కథను సాహిత్య కథగా మాత్రమే కాకుండా ఒక సామాజిక సాక్ష్యంగా కూడా చదవవచ్చు.

గౌడుల వృత్తి గురించి చెప్పేటప్పుడు సాధారణంగా తాటిచెట్టు ఎక్కే పురుషుడి బొమ్మ ముందుకు వస్తుంది. కానీ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆ దృశ్యాన్ని మార్చి తాటిచెట్టు ఎక్కే స్త్రీని కథానాయికగా నిలబెట్టాడు. ఇది కథకు ఉన్న ప్రత్యేకత. బీసీ చైతన్య దృక్పథం ఈ కథలో ప్రత్యక్ష రాజకీయ నినాదాల కంటే జీవిత వాస్తవాల ద్వారా బీసీ చైతన్యం వ్యక్తమవుతుంది. కులవృత్తుల పట్ల గౌరవం, శ్రమకు విలువ, వృత్తిపై హక్కు, విద్య ద్వారా సామాజిక ఎదుగుదల, సామాజిక అవమానానికి ప్రతిఘటన, స్త్రీ ఆత్మగౌరవం ఇవి అన్నీ బీసీ సామాజిక చైతన్యంలోని ముఖ్యమైన అంశాలు. అందువల్ల 'ముండరాలు' కథను గౌడ సమాజపు అంతర్గత జీవితాన్ని ప్రతిబింబించే బీసీ సామాజిక వాస్తవిక కథగా పరిగణించవచ్చు.

**కథలోని ప్రధాన ప్రతీకలు:**

తాటిచెట్టు జీవనాధారం, శ్రమ, ప్రమాదం, కులవృత్తి ఈ నాలుగింటికీ ప్రతీక. నర్సయ్యకు తాటిచెట్టు మరణాన్ని తెస్తుంది. ఎల్లవ్వకు అదే తాటిచెట్టు జీవనాధారమవుతుంది. ఇది కథలోని అత్యంత అద్భుతమైన ప్రతీకాత్మక విరోధాభాసం. కల్లు గౌడ జీవనోపాధి, గ్రామీణ సంస్కృతి, సామాజిక సంబంధాలకు ప్రతీక. మోకు తాటిచెట్టు ఎక్కడానికి ఉపయోగించే పరికరం మాత్రమే కాదు; తరతరాల వృత్తి, జీవన పోరాటం, సామాజిక అస్తిత్వానికి ప్రతీక. 'ముండ' అనే పదం వితంతువుపై సమాజం మోపిన అవమాన ముద్రకు ప్రతీక. విద్య సామాజిక చలనశీలతకు ప్రతీక.

నరేందర్ ఉద్యోగం పొందడంతో ఎల్లవ్వ జీవితానికి ఒక విజయం లభించినట్లు కనిపిస్తుంది. కానీ రమ్య ప్రవేశంతో మరోసారి ఆమె ఒంటరితనం బయటపడుతుంది. ఇక్కడ రచయిత ఒక సులభమైన పరిష్కారాన్ని ఇవ్వలేదు. చదువు వచ్చింది కాబట్టి సమస్యలన్నీ పోయాయి అని చెప్పలేదు. ఉద్యోగం వచ్చింది కాబట్టి గౌరవం శాశ్వతమైంది అని చెప్పలేదు. దానికి బదులుగా సామాజిక స్థానం మారవచ్చు; ఆర్థిక పరిస్థితి మారవచ్చు; విద్య రావచ్చు; కానీ మనుషులలోని కుల, లింగ, పితృస్వామ్య భావజాలం మారకపోతే అణచివేత కొత్త రూపాల్లో కొనసాగుతూనే ఉంటుంది. అనే లోతైన సందేశాన్ని కథ అందిస్తుంది.

కథ యొక్క సామాజిక సందేశం 'ముండరాలు' కథ చివరకు కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను మన ముందుంచుతుంది. భర్తను కోల్పోయిన స్త్రీ ఎందుకు 'ముండ' అవుతుంది? ఆమె వ్యక్తిత్వానికి భర్త ఉనికే ఎందుకు ప్రమాణం? శ్రమించే స్త్రీపై ఎందుకు శీలనింద? కులవృత్తి చేసే చేతులకు ఎందుకు గౌరవం లేదు? స్త్రీ ఆర్థికంగా స్వతంత్రురాలైతే కూడా ఆమె స్వేచ్ఛను ఎందుకు అనుమానిస్తారు? విద్యావంతులైనవారిలో కూడా పితృస్వామ్యం ఎందుకు కొనసాగుతుంది? మనిషి గౌరవం అతని శ్రమతో నిర్ణయించబడాలా? లేక సామాజిక స్థాయితోనా? ఈ ప్రశ్నలకు కథ నేరుగా ఉపన్యాసం ఇవ్వదు. ఎల్లవ్వ జీవితాన్ని మన ముందుంచి మనమే సమాధానాలు వెతుక్కునేలా చేస్తుంది.

నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ రచించిన 'ముండరాలు' కథ ఒక వితంతువు కథగా మొదలై, ఒక సమాజపు స్త్రీ జీవిత కథగా విస్తరించి, చివరకు కులం, లింగం, శ్రమ, ఆత్మగౌరవం, విద్య, ఆధునికతలపై ప్రశ్నలు సంధించే సామాజిక కథగా రూపుదిద్దుకుంది.

ఎల్లవ్వ పాత్రలో వేదన ఉంది. శ్రమ ఉంది. ఆత్మగౌరవం ఉంది; తిరుగుబాటు ఉంది; తల్లితనం ఉంది; ఆశ ఉంది. ఆమె తాటిచెట్టు ఎక్కడం కేవలం వృత్తి నేర్చుకోవడం కాదు. సమాజం తనకు కేటాయించిన బలహీనతను అధిగమించడం.

నర్సయ్యకు మరణానికి కారణమైన తాటిచెట్టు ఎల్లవ్వకు జీవనాధారంగా మారడం కథలోని ప్రధాన ప్రతీకాత్మక బలం. భర్త మరణంతో 'ముండరాలు'గా మిగిలిపోవాల్సిన స్త్రీ, అదే సమాజంలో తన శ్రమతో నిలబడుతుంది. కానీ ఆమె ఆర్థిక స్వావలంబనను సమాజం గౌరవించదు; ఆమె శీలాన్ని మాత్రం ప్రశ్నిస్తుంది. కొడుకు చదివి ఉద్యోగం పొందినప్పుడు మాత్రం ఆమెకు గౌరవం పెరుగుతుంది. దీని ద్వారా మన సమాజం శ్రమను కాకుండా సామాజిక స్థాయిని గౌరవించే వైరుధ్యాన్ని రచయిత బహిర్గతం చేస్తాడు.

రమ్య పాత్ర ద్వారా కథ మరో ముఖ్యమైన విషయాన్ని సూచిస్తుంది. ఆధునిక విద్య, ఉద్యోగం, పట్టణ జీవితం వచ్చినంత మాత్రాన పాత పితృస్వామ్య భావజాలం అంతరించిపోదు. అది కొత్త భాషలో, కొత్త సంబంధాల్లో, కొత్త కుటుంబ నిర్మాణాల్లో కూడా కొనసాగవచ్చు. అందువల్ల 'ముండరాలు' కేవలం ఎల్లవ్వ కథ కాదు; భర్తను కోల్పోయి తన అస్తిత్వాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదని చెప్పే ప్రతి స్త్రీ కథ. కులవృత్తి చేసే చేతులకు గౌరవం రావాలని కోరే ప్రతి శ్రామికుడి కథ. శ్రమతో ఎదగాలనుకునే ప్రతి కుటుంబం కథ. విద్య ద్వారా సామాజిక మార్పును కోరుకునే ప్రతి అణగారిన వర్గం కథ.

'మోకు'లో గౌడుల జీవితం, సంస్కృతి, వృత్తి, సామాజిక అనుభవాలను వివిధ కోణాల్లో ప్రతిబింబించే కథల మధ్య 'ముండరాలు' స్త్రీ అస్తిత్వాన్ని కేంద్రంగా చేసుకుని ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ కథ వితంతుత్వంపై ఉన్న అమానవీయ ముద్రను ప్రశ్నిస్తూ, కులవృత్తిపై గౌరవాన్ని ప్రకటిస్తూ, శ్రమజీవి స్త్రీ ఆత్మగౌరవాన్ని ప్రతిష్ఠిస్తూ, విద్యను సామాజిక మార్పుకు సాధనంగా ప్రతిపాదిస్తూ, పితృస్వామ్య సమాజపు ద్వంద్వ నైతికతను బట్టబయలు చేసే శక్తివంతమైన సామాజిక వాస్తవిక కథగా గుర్తించవచ్చు. అందుకే 'ముండరాలు' కథలో ఎల్లవ్వ ఒక మౌన బాధితురాలు కాదు; అవమానాల మధ్య కూడా తన బతుకును తానే మోసుకెళ్లిన శ్రామిక స్త్రీ. ఆమె భుజాన వేసుకున్న మోకు కేవలం తాటిచెట్టు ఎక్కడానికి ఉపయోగించే పరికరం కాదు తన జీవితాన్ని, తన కొడుకు భవిష్యత్తును, తన ఆత్మగౌరవాన్ని మోసిన ఒక స్త్రీ పోరాటానికి ప్రతీక.

శ్రీనివాస్ దాసరి
రీసెర్చ్ స్కాలర్, తెలుగు విభాగం
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ
7702665815

